ప్రారంభిస్తున్న కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి

'నూతన' ఆశలతో..

- కొత్త సంవత్సరంలోకి అడుగులు...
- లక్ష్యాలతో ముందుకెళ్తేనే ప్రయోజనం

2025 సంవత్సరంలో మనసు పిండేసే చేదు అనుభవాలు.. హృదయంలో దాచుకునే మధుర జ్ఞాపకాలు.. మరిచిపోలేని తీపి గుర్తులు నెమరు వేసుకుంటుండగా చిన్నముల్లు, పెద్ద ముల్లు 12 వద్దకు చేరాయి. ఒక సంవత్సరం కాలగర్భంలో కలిసిపోయింది. నూతన సంవత్సరం ప్రారంభమైంది.. ఒక్కసారిగా హ్యాపీ న్యూ ఇయర్ అనే అరుపులు అంబరాన్ని అంటాయి. అందరి చేతులు కలిశాయి. శుభాకాంక్షలు చెప్పుకున్నారు. తారా జువ్వలు ఆకాశంలో తళకులీనాయి. కేక్ కటింగులు, చిన్నా పెద్దల చిందులతో, ఉరకలెత్తే ఉత్సాహంతో, యువత కేరింతలతో, క్రైస్తవులు ప్రార్థనలతో 2026కు స్వాగతం పలికారు. కొంగొత్త ఆశలతో మొదలవనున్న కొత్త ఏడాదిలో లక్ష్యాలతో ముందుకెళ్తేనే ఫలితం సాధ్యమవుతుంది.....

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

నూతన సంవత్సర కొత్త ఉత్సాహంతో జిల్లా వ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది. కోటి ఆశలతో ప్రజలు నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. బుధవారం రాత్రి 7 గంటల నుంచే న్యూ ఇయర్ సందడి మొదలైంది. నగరంలోని చర్చిలు దీప కాంతులు నడుమ మెరిసిపోయాయి. దైవ సన్నిధిలో క్రైస్తవులు న్యూ ఇయర్‌కు స్వాగతం పలికారు. సరిగ్గా అర్ధరాత్రి 12 గంటలు కాగానే ఒకరికొకరు నూతన సంవత్సర శుభాక్షాంక్షలు తెలుపుకున్నారు. వైన్ షాపుల వద్ద ఎక్కువ సంఖ్యలోనే కొనుగోలుదారులు దర్శనమిచ్చారు. రోడ్లపై యువత కేరింతలు కొడుతూ తిరిగారు.

జోరుగా కేకుల అమ్మకాలు

కర్నూలు, నంద్యాల నగరాలతో పాటు అన్ని పట్టణాల్లో బుధవారం ఉదయం నుంచే కేకుల అమ్మకాలు జోరుగా సాగాయి. రోడ్ల పక్కన, దుకాణాల ముందు ప్రత్యేక షామినాయాలు వేసి కేకులను విక్రయించారు. కేజీ సాధారణ కేకు రూ.200 నుంచి రూ.250 వరకూ, కేజీ కూల్ కేకు రూ.500 వరకూ విక్రయించారు. పలు ప్రాంతాల్లో కేజి కేకు కొంటే కూల్‌డ్రింక్ ఉచితంగా ఇస్తామంటూ ఆఫర్లు ప్రకటించారు. కొత్త సంవత్సరం సందర్భంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ.20 కోట్లకు పైగా వ్యాపారం జరుగుతుందని అంచనా. ఈ ఏడాది ప్రధాన ప్రాంతాల్లో బిర్యానీలను కూడా విక్రయించారు.

నూతన లక్ష్యాలు ఉండాలిలా...

ఒక్కసారి గడిచిన ఏడాదిని సమీక్షించుకున్న తర్వాత ఈ ఏడాదిలో ఆశిస్తున్న మార్పు గురించి స్పష్టత సాధించాలి. ఆలోచనలను నిర్దిష్టమైన లక్షాలుగా మార్చుకోవాలి. ఒకచోట రాసుకోవాలి. ఒక్కటే పెద్ద లక్ష్యం పెట్టుకోవడం కన్నా కొన్ని వేర్వేరు లక్ష్యాలను పెట్టకోవడం ప్రయోజనకరం.

ఆర్థిక లక్ష్యాలు : నెలవారీ ఆదాయం పెంచుకోవడం, పొదుపు చేయడం, ఒక కొత్త ఆస్తిని ఏర్పాటు చేసుకోవడం అందరికీ మంచిది.

నైపుణ్య లక్ష్యాలు : ఉద్యోగులు తమ ఉద్యోగాల్లో కొత్త నైపుణ్యాలు సాధించడం, విద్యార్థులు కొత్త కోర్సులు చేయడం.

మానసిక లక్ష్యాలు : ఒక చెడు అలవాటును మార్చుకోవడం (స్మోకింగ్, మద్యం, గుట్కా, మత్తు మందులు, పేకాట వంటివి), ఒక మంచి అలవాటు చేసుకోవడం (వాకింగ్, వ్యాయామం, పుస్తక పఠనం వంటివి).

వృత్తి లక్ష్యాలు : ఇంక్రిమెంట్లు సాధించడం, ప్రమోషన్లు సాధించడం ఇలా వేర్వేలు లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల జీవన శైలి మారుతుంది. వ్యక్తిగతంగా మారితే సమాజం మారుతుంది. కాబట్టి మనం పలు లక్ష్యాలు ఈ కొత్త సంవత్సరంలో పెట్టుకుందాం. దానికి తగ్గ ప్రయత్నం చేసి ఫలితాలను సాధిద్దాం...

స్పెషల్ కంట్రోల్ రూమ్ ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టర్

కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నూతన స్పెషల్ కంట్రోల్ రూమ్ (కంప్లైంట్ సెల్)ను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యం, విద్య, సంక్షేమ వసతి గృహాలు, సమగ్ర శిశు అభివృద్ధి శాఖల వినతులు, ఫిర్యాదులు గురించి , ఆయా శాఖలలో అమలు చేస్తున్న పథకాల అమలు చేయుటకు సలహాలు తీసుకొనుటకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. 24 గంటలు అందుబాటులో ఉండి ఆర్థికేతర సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. నిధులు అవసరం వున్నా సమస్యలు ప్రభుత్వంకు పంపుటకు నివేదికలు తయారు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు స్పెషల్ కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 4299 ద్వారా వచ్చిన 109 కాల్స్ లో 99 పరిస్కారం అయ్యాయన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారిణి వెంకట నారాయణమ్మ, సెట్కూరు సిఇఒ కె.వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ భరోసా కింద రూ.104.23 కోట్ల పంపిణీ

ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ పథకం కింద డిసెంబర్ 31న జిల్లాలో అర్హులైన 2,37,235 మంది పెన్షన్ లబ్ధిదారులకు రూ.104.23 కోట్లు పంపిణీ చేశామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి పేర్కొన్నారు. బుధవారం ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో భాగంగా కల్లూరు మండలం ఎ.గోకులపాడు గ్రామంలో జిల్లా కలెక్టర్ లబ్ధిదారులకు పెన్షన్ నగదున అందజేశారు. కార్యక్రమంలో కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, డిఆర్‌డిఎ పిడి రమణారెడ్డి, కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి

మాట్లాడుతున్న గుడిసె కృష్ణమ్మ

రూ.50 వేల కోట్ల అభివృద్ధి పనులు చేశాం

- టిడిపి జిల్లా అధ్యక్షులు గుడిసె కృష్ణమ్మ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

టిడిపి కూటమి ప్రభుత్వం తన 18 నెలల పాలనలో రూ. 50 వేలకోట్ల అభివ వృద్ధి సంక్షేమ పథకాలను చేపట్టిందని టిడిపి జిల్లా అధ్యక్షులు గుడిసెకృష్ణమ్మ తెలిపారు. బుధవారం టిడిపి కర్నూలు జిల్లా కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం హయాంలో అభివృద్ధిని మరిచి అరాచక పాలన చేశారని ఆరోపించారు. 2019-2024 మధ్య కాలంలో జగన్మోహన్‌రెడ్డి అనుచరుడు సాగించిన అరాచక పాలనను ఈసడించుకున్న రాష్ట్రప్రజలు 2024 సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం కూటమి పార్టీలకు తిరుగులేని మెజార్టీని కట్టబెట్టారన్నారు. వైసిపికి కనీసం ప్రతిపక్షస్థానం కూడా లేకుండా చేశారని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పూల నాగరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన అనుభవంతో రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమాన్ని ప్రజలకు అత్యంత చేరువ చేశారన్నారు. ప్రజలు కూటమి ప్రభుత్వ పాలనను కొనియాడుతున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు హామీలను సంపూర్ణంగా నెరవేర్చారన్నారు. ఇవే కాకుండా ప్రత్యేకంగా మంత్రి టిజి. భరత్ ఇచ్చిన ఆరు హామీలలో మూడు హామీలను తన సొంత నిధులతో ఇప్పటికే నెరవేర్చారన్నారు. ఆ దిశగా ప్రజలు 15 ఏళ్ల పాటు టిడిపికి అవకాశం ఇవ్వాలని కోరారు. డిసిఎంఎల్ ఛైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేసిందన్నారు. పొదిలి కార్పొరేషన్ ఛైర్మన్ విక్రమ్ సింగ్ మాట్లాడుతూ... తనకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తనకు పొదిలి రాష్ట్ర ఛైర్మన్ పదవి ఇచ్చి అట్టడుగు వర్గాల పట్ల ప్రేమను చాటుకున్నారన్నారు. హజ్ కమిటీ స్టేట్ డైరెక్టర్ మన్సూర్ అలీ ఖాన్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం హజ్ కమిటీ ఆధ్వర్యంలో గతంలో 60 వేల ఎకరాల వక్ఫ్ బోర్డు భూమిని గుర్తించారన్నారు. కార్పొరేటర్లు, పద్మలతారెడ్డి, కె.పరమేష్, డైరెక్టర్లు ఎస్. ముంతాజ్, నంద్యాల నాగేంద్ర, మన్సూర్ అలిఖాన్. జేమ్స్, ప్రసాద్, మనోజ్, కౌశిక్, నాయకులు బేతం కృష్ణుడు పాల్గొన్నారు.

ఈ ఏడాదైనా హైకోర్టు బెంచి వచ్చేనా..?

- నెరవేరని కూటమి హామీ
- శాసనసభలో తీర్మానం చేసినా కానరాని పురోగతి

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర గడిచినా కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేస్తామన్న హామీ నెరవేరలేదు. శాసనసభలో తీర్మానం చేసినా పురోగతి కానరావడం లేదు. నూతన సంవత్సరంలోనైనా హైకోర్టు బెంచి వస్తుందో లేదోనని జిల్లా వాసులు ఎదురు చూస్తున్నారు...

టిడిపి నేతృత్వంలోని ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర మంత్రివర్గం, శాసనసభ, శాసన మండలిలో తీర్మానాలను ఆమోదించి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పంపారు. చారిత్రక కట్టుబాట్లు, రాజ్యాంగ సముచితతలో పాతుకుపోయిన రాయలసీమ ప్రాంత ఈ దీర్ఘకాల డిమాండ్ ఇంకా కార్యరూపం దాల్చలేదు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధానపరమైన లాంఛనాలను నెరవేర్చినప్పటికీ, ఎటువంటి పురోగతి సాధించలేదు. నవంబర్ 2024లో వికేంద్రీకృత పాలన, ముఖ్యంగా రాయలసీమ, కోస్తా ఆంధ్ర, ఉత్తర ఆంధ్ర అభివృద్ధిని సమతుల్యం చేయడం అనే వాగ్దానంపై టిడిపి-బిజెపి-జనసేన కూటమి అధికారంలోకి వచ్చింది. వారి కీలక హామీలలో ఒకటి కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు. 2024 నవంబర్ 20న ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం ఈ ప్రతిపాదనను ఆమోదించింది. మరుసటి రోజు, శాసనసభ ఏకగ్రీవంగా ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ప్రాంతీయ నిర్లక్ష్యం నుండి రక్షణగా రాయలసీమకు న్యాయం, పరిపాలనా సంస్థలను హామీ ఇచ్చిన 1937 శ్రీబాగ్ ఒప్పందాన్ని తీర్మానం ఉదహరించింది. దీని తర్వాత, రాజ్యాంగ నిబంధనల ప్రకారం అవసరమైన సంప్రదింపుల కోసం ప్రతిపాదనను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి పంపారు. ఈ హామీలు, పరిపాలనాపరమైన పునాది పనులు ఉన్నప్పటికీ ఈ ప్రతిపాదన హైకోర్టు చివరలో వేలాడుతోంది. ఈ ఏడాదిలో, హైకోర్టు రిజిస్ట్రార్ 15 మంది న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది సహాయక సౌకర్యాలకు ఆతిథ్యం ఇవ్వడానికి మౌలిక సదుపాయాల గురించి కర్నూలు జిల్లా కలెక్టర్ నుండి సమాచారం కోరింది. వారి అభిప్రాయం లేదా సమ్మతి గురించి ఎపి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, పూర్తి కోర్టు నుండి అధికారిక సమాచారం రాలేదు. ఈ ఏడాది జూన్‌లో మంత్రి నారా లోకేష్ డిమాండ్‌ను పునరుద్ఘాటించడానికి కేంద్ర న్యాయ మంత్రిని మళ్ళీ కలిశారు. కానీ ఎపి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి చర్య తీసుకొని సమ్మతి ఇచ్చే వరకు, కేంద్రం అధికారికంగా బెంచ్ ఏర్పాటును తెలియజేయదు. ఇటీవల కర్నూలులో హైకోర్టు బెంచి ఏర్పాటు కోసం నగరంలోని ఎ, బి, సి క్వాటర్‌లలో స్థలాన్ని కేటాయించడం కోసం క్వాటర్లలో ఉన్న వారిని ఖాళీ చేయించేలా మంత్రి ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఆ ప్రయత్నం కూడా చేశారు. అయితే దానికి ప్రజలు, పలు సంఘాల నుంచి వ్యతిరేకత వ్యక్తంకావడంతో అధికారులు వెనక్కి తగ్గారు. కర్నూలు శివార్లలో ప్రభుత్వ స్థలాలు ఉన్నా అక్కడ స్థలాలు పరిశీలించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఉమ్మడి జిల్లాకు చెందిన ఎన్‌ఎండి ఫరూక్ న్యాయ శాఖ మంత్రిగా ఉండటం, ఆర్‌అండ్‌బి శాఖ మంత్రిగా జిల్లాకు చెందిన బిసి జనార్ధన్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రిగా కర్నూలుకు చెందిన టిజి భరత్ ఉన్నా కూడా హైకోర్టు బెంచి ఏర్పాటులో వారు విఫలం అయ్యారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనికి కేంద్రంలో ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు రాష్ట్ర ఎంపీల మద్దతు లేనిదే నడవని పరిస్థితి ఉన్నా...రాయలసీమకు సంబంధించిన ఏఒక్క హామీలు అమలుకు నోచుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హైకోర్టు మెంచ్ హామీతోపాటు కడప ఉక్కు ప్యాక్టరీ, కర్నూలు జిల్లా గుండ్రేవుల ప్రాజెక్టు హామీలను అమలు చేయడంలో విఫలమవుతున్నారని తీవ్ర విమర్శఉంది. నూతన సంవత్సరంలోనైనా హైకోర్టు బెంచి వస్తుందో లేదోనని జిల్లా వాసులు ఎదురు చూస్తున్నారు.

ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలి

రాయలసీమ జిల్లాల ప్రజలు కర్నూలులో హైకోర్టు బెంచి ఏర్పాటు చేస్తారని ఆశిస్తున్నా కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. సీమ వాసుల ఆశలు నెరవేరడం లేదు. ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. తక్షణమే కర్నూలులో హైకోర్టు బెంచి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.

- కె.విజయకుమార్, ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర అధ్యక్షులు.

రాజకీయ పార్టీలు, పౌర సమాజం డిమాండ్ చేయాలి

హైకోర్టు కాకపోయినా హైకోర్టు బెంచ్‌కోసం చాలా కాలంగా ప్రజలు ఎదురుచూస్తున్నారు. రాయలసీమ ప్రాంతంలో చాలా కాలంగా మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు, సంస్థల పరంగా నిర్లక్ష్యం చేశారని భావిస్తున్నారు. ఒకప్పుడు ఆంధ్ర రాష్ట్ర రాజధానిగా ఉన్న కర్నూలును, వరుస ప్రభుత్వాలు రాష్ట్ర ప్రణాళికలో వెనుకబడి ఉంచాయి. హైకోర్ట్ బెంచ్ ఏర్పాటు కేవలం న్యాయం యొక్క ప్రతీకాత్మక చర్య మాత్రమే కాదు. అందుబాటులో ఉన్న చట్టపరమైన పరిష్కారాలు, ప్రాంతీయ సమానత్వం, పరిపాలనా వికేంద్రీకరణ వైపు ఒక ఆచరణాత్మక అడుగు. ఇది రాజకీయ సమస్య కాదు. ఇది రాజ్యాంగ నిబద్ధత, నైతిక ఆవశ్యకత. రాయలసీమ ప్రాంత ప్రజలు సంబంధిత సంస్థలు, అధికారుల నుండి స్పష్టమైన సమాధానం పొందాలి. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు స్పందించి, త్వరితగతిన చర్య తీసుకుని, కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు ఎటువంటి ఆలస్యం లేకుండా అనుమతి ఇచ్చేలా ఈ విషయాన్ని కొనసాగించాలని న్యాయ సమాజం, రాజకీయ పార్టీలు, పౌర సమాజం, మీడియా డిమాండ్ చేయాలి. రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి. "ఈ విషయంలో న్యాయం ఆలస్యం కావడం అంటే న్యాయం నిరాకరించబడడమే".

- వై.జయ రాజు, నేషనల్ లాయర్స్ ఫోరమ్ ఫర్ సోషల్ జస్టిస్ అధ్యక్షులు.

వృద్ధులకు దుప్పట్లు, స్వీట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

వృద్ధులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

- వృద్ధాశ్రమంలో దుప్పట్లు, స్వీట్లు పంపిణీ చేసిన డాక్టర్ శంకర్ శర్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : పేదలకు తనవంతుల సహాయసహకారాలు ఎప్పుడు ఉండాలని డాక్టర్. శంకర్ శర్మ తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా కర్నూలు సమీపంలోని జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల వద్దనున్న టిజి వెంకటేష్ కాలనీలోని కృపా వృద్ధాశ్రమంలో వృద్ధులకు డాక్టర్ శంకర్ శర్మ దుపట్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ ప్రస్తుతం చలి ఎక్కువగా ఉన్నందున వృద్ధులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలన్నారు. పేద వృద్ధులకు తన వంతు సహాయంగా దుప్పట్లు పంపిణీ చేశానన్నారు. వృద్ధాశ్రమం నిర్వహిస్తున్న అబ్రహంను అభినందించారు. వృద్ధాశ్రమాన్ని శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు తగిన ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పేద వృద్ధులకు ఎలాంటి సహాయం కావాలన్నా తనవంతు సహాయం చేస్తానని తెలిపారు. జనవరి నెలలో కృపా వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకులు ఇస్తానని డాక్టర్. శంకర్ శర్మ హామీ ఇచ్చారు. వృద్ధులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి వారికి స్వీట్లు పంపిణీ చేశారు.

ఘనంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

- ప్రభుత్వ విద్యారంగాన్ని రక్షణకు పోరాటం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) కర్నూలు నగర కమిటీ ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం ప్రభుత్వ జూనియర్ కాలేజ్ బికాంప్, సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఫార్మసీ కళాశాల, ప్రభుత్వ బిసి సంక్షేమ వసతిగృహాలు, ఎస్సీ సంక్షేమ వసతిగృహం కమిటీలు జెండా ఆవిష్కరణలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ కర్నూలు నగర అధ్యక్ష కార్యదర్శులు ఆర్య, అంజి మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యను కాషాయీకరణ ప్రైవేటీకరణ చేయడం కోసం నూతన విద్యా విధానం పేరుతో విద్యారంగంలో అనేక మార్పులు తీసుకొని వస్తుందన్నారు. ఆ మార్పుల వల్ల విద్యార్థులకు అశాస్త్రీయ భావాలు నేర్పించాలనే ప్రయత్నం చేస్తుందన్నారు. ఎస్ఎఫ్ఐగా కేంద్రం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానానికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడం కోసం ఎస్ఎఫ్ఐ పోరాటాలు నిర్వహిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కర్నూలు నగర ఉపాధ్యక్షులు పృధ్వి , నగర నాయకులు రామలింగడు, రంగనాథ్, బాలకృష్ణ, శ్రీనాథ్, హరి, రంగ, ఉదయ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

2025 ముగిసిందిలా..

- బడ్జెట్‌లో అన్యాయం
- వెల్లువెత్తిన నిరసనలు, ఆందోళనలు
- ప్రమాదాలు.. ప్రముఖుల పర్యటనలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

2025 ముగిసిపోయింది. నూతన సంవత్సరం ఆరంభమైంది. 2025 సంవత్సరంలో జిల్లాలో పలు ఘటనలు చోటు చేసుకున్నాయి. ప్రమాదాలు హృదయాలను చలించేలా చేశాయి. ప్రముఖుల పర్యటనలతో కళకళలాడింది. అదే సమయంలో ప్రభుత్వ విధానాలపై నిరసనలు, ఆందోళనలు హోరెత్తాయి. ఎప్పటిలాగే 2025లోనూ బడ్జెట్‌కు అన్యాయం తప్పలేదు...

ఉత్సాహంగా బాలోత్సవాలు

కర్నూలు, నంద్యాల జిల్లాలో బాలోత్సవాలు ఉత్సాహంగా సాగాయి. కర్నూలు జిల్లాలో ఈ ఏడాదిలో రెండు బాలోత్సవాలు జరిగాయి. ఫిబ్రవరి 6,7న 4వ బాలోత్సవం, డిసెంబర్ 9, 10 తేదీల్లో నగర శివార్లలోని మాంటిస్సోరి ఇండస్ పాఠశాలలో 5వ కర్నూలు బాలోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నంద్యాలలో జనవరి 23, 24 తేదీల్లో నంది బాలోత్సవాలు నిర్వహించారు.

విషాద ప్రయాణం

కర్నూలు సమీపంలో కల్లూరు మండలం చిన్నటేకూరు సమీపంలో 44వ జాతీయ రహదారిపై అక్టోబర్ 24 తెల్లవారుజామున జరిగిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అగ్ని ప్రమాదం మొత్తం ప్రాంతాన్ని భీతావహ వాతావరణంలో ముంచెత్తింది. హైదరాబాద్-బెంగళూరు 44వ జాతీయ రహదారి పక్కన కాలి బూడిదైన ఆ బస్సు కేవలం ఇనుప అస్థిపంజరంలా మిగిలిపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో 43 మంది ప్రయాణికులతో నిండిన ఆ బస్సులో 19 మంది నిద్రలోనే అగ్నికి ఆహుతైయ్యారు. కాలిపోయిన వస్తువులు, భయానకమైన దృశ్యాలు ఆ ప్రాంతమంతా కనిపించాయి. భయంకరమైన ప్రమాదం నుంచి తప్పించుకున్న కొద్దిమంది ప్రయాణికులు కాలిన గాయాలతో, నిస్సత్తువతో, ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పరుగులు తీసిన ఆ క్షణాలను తలచుకొని వణికిపోయారు. ఈ దుర్ఘటన తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.

బడ్జెట్‌లలో అన్యాయం

కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు నిధులు కేటాయించలేదు. మరో సారి మొండి చేయి చూపారు. కొత్త రైళ్లు, కొత్త రైల్వే లైన్లకు ఒక్క పైసా కూడా కేటాయించ లేదు. కర్నూలు సిటీ రైల్వే స్టేషన్ నుంచి విజయవాడ మీదుగా మచిలీపట్నం వరకూ గతంలో రైలు ఉండగా దాన్ని రద్దు చేశారు. దాన్ని తిరిగి నడపాలన్న డిమాండ్ ప్రజల నుంచి వ్యక్తం అవుతోంది. కాచిగూడ నుంచి గుంటూరుకు నడిచే ఎక్స్‌ప్రెస్ రైలును విజయవాడ వరకూ పొడిగించాలన్న ప్రజల ఆకాంక్ష నెరవేరలేదు. బడ్జెట్లో కొత్త లైన్ల ప్రస్తావన ఏ మాత్రం లేకుండా పోయింది. రాష్ట్ర బడ్జెట్‌లోనూ గుండ్రేవుల, వేదవతి, ఆర్‌డిఎస్ కుడి కాలువ నిర్మాణాలకు ఎలాంటి నిధులు కేటాయించలేదు. ఉర్దూ యూనివర్సిటీ ప్రస్తావన లేకుండా పోయింది.

ఆగని రక్తపాతం

దసరా సందర్భంగా అక్టోబర్ 2న నిర్వహించిన హొళగుంద మండల పరిధిలోని శ్రీ మాళ మల్లేశ్వరల జైత్రయాత్ర (కర్రల సమరం)లో రక్తపాతం ఆగలేదు. నిఘానేత్రాలు ఉన్నప్పటికీ కర్రలు నాట్యం ఆడాయి. పోలీసుల వ్యూహాలు ఫలించలేదు. జైత్ర యాత్రలో తల పగిలి ఒకరు, తొక్కిసలాటలో మరొకరు మృతి చెందారు. 80 మందికి గాయాలయ్యాయి. 800 మంది పోలీసులు ఉన్నప్పటికీ రింగ్ కర్రలను దేవరగట్టుకు రాకుండా ఆపలేకపోయారు. అవగాహన సదస్సులు, రింగ్ కర్రలు స్వాధీనం చేసుకున్నప్పటికీ రక్తపాతం ఆగలేదు.

రైతులకు తప్పని నష్టాలు

2025లో రైతులకు నష్టాలు తప్పలేదు. మిర్చికి తెగుళ్ల సోకి దిగుబడి తగ్గడంతో మిర్చి రైతులు నష్టాలను మూటగట్టుకున్నారు. ఉమ్మడి జిల్లాలో ఏప్రిల్‌లో కురిసిన వర్షాలను రైతులను ముంచాయి. భారీ వర్షానికి వరి ధాన్యం మునిగిపోయి, వర్షపు నీటిలో ధాన్యం కొట్టుకుపోయింది. కల్లాలలో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. కర్నూలు ఉల్లి మార్కెట్‌లో ధర మరింత పడిపోయింది. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటా రూ.1200కు కొంటున్నా రైతుకు నష్టమే వచ్చింది. పెట్టుబడి కూడా రాలేదు. టమోటా పంట వర్షానికి తడవడంతో టమోటాలు నాణ్యత పూర్తిగా దెబ్బతిన్నాయి. కిలో 50 పైసలకు కూడా అమ్ముకోవాల్సిన దుస్థితి వచ్చింది.

నిరసనల హోరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై వామపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన హోరు సాగింది. ట్రూఅప్, ఎఫ్‌పిపిసిఎల పేరుతో విద్యుత్ భారాలను నిరసిస్తూ ఆందోళనలు చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేలా కొత్త చట్టాన్ని తీసుకురావడాన్ని నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా వామపక్షాల ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించారు. వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకిస్తూ కర్నూలులో ముస్లిం జెఎసి, ఆవాజ్ ఆధ్వర్యంలో కర్నూలులోని అలీషేర్ బాగ్‌లో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. నంద్యాల జిల్లా ఆత్మకూరులో జెఎసి ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. అమెరికా ఉపాధ్యక్షులు జెడి వాన్స్ భారత్ రాకను వ్యతిరేకిస్తూ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. పార్లమెంట్‌లో అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర మంత్రి అమిత్‌షా రాష్ట్ర పర్యటనను వ్యతిరేకిస్తూ కర్నూలు, నంద్యాల జిల్లాలోని పలు ప్రాంతాల్లో వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు, ఆశాలు, విఓఎలు, 104 ఉద్యోగులు ఆందోళనలు నిర్వహించారు.

నిరాశ పరచిన మోడీ పర్యటన

కర్నూలులో అక్టోబర్ 16న ప్రధానమంత్రి మోడీ పర్యటించారు. జిల్లాకు మోడీ ఎలాంటి వరాలూ ఇవ్వలేదు. కర్నూలు నగర శివారులలోని నన్నూరు టోల్ ప్లాజా వద్దా రాగ మయూరి హిల్స్ సమీపంలో సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్ సభ నిర్వహించారు. శ్రీశైలం పర్యటన ముగించుకొని నేరుగా ప్రధాని నరేంద్ర మోడీ, సిఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నన్నూరు వద్ద హెలీప్యాడ్‌కు చేరుకున్నారు. బహిరంగ సభకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసి ఓపెన్ టాప్ వాహనంలో ముగ్గురూ ప్రజలకు అభివాదం చేస్తూ వేదికకు చేరుకున్నారు. వర్చువల్ విధానం ద్వారా వివిధ ప్రాజెక్టులను మోడీ ప్రారంభించారు.

మహిళా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సావిత్రిబాయి పూలే జయంతి జనవరి 3న మహిళ ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించాలని బహుజన్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భాస్కర్, నందీశ్వరుడు జిల్లా గౌరవాధ్యక్షుడు రామశేషయ్య డిమాండ్ చేశారు. బుధవారం డిఇఒను కలిసి వినతిపత్రం సమర్పించారు. మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

2న డయల్ యువర్ కమిషనర్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం 9 గంటల నుండి పది గంటల వరకు 08518221847 నెంబర్‌కు ఫోన్ చేసి నగరంలోని వీధి దీపాలు మరమ్మతులు, తాగు నేటి సమస్యలు, రహదారుల మరమ్మతులు, పారిశుధ్యం వంటి సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించబడనని కమిషనర్ పి.విశ్వనాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

భగ్గుమన్న పెద్దహరివాణం

-రోడ్డు దిగ్బంధన...కొనసాగుతున్న నిరవధిక నిరాహార దీక్షలు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పెద్ద హరివాణం ను మండలంగా కొనసాగించాలని కోరుతూ గత రెండు రోజులుగా రోడ్ల దిగ్బంధన, నిరవధిక నిరాహార దీక్షలు, రోడ్డుపై వంట వార్పు చేపట్టారు. అనంతరం ఆదినారాయణరెడ్డి, మెడికల్ నాగరాజు, రాఘవేంద్ర ఆచారి, కాంట్రాక్టర్ లక్ష్మీకాంత మాట్లాడుతూ పెద్ద హరివాణం మండలంగా గెజిట్ విడుదలైంది. ప్రభుత్వ నిర్ణయం ఖరారైనా ఇంకా కుట్రలేనా అని ప్రశ్నించారు. 16 ప్రత్యేక గ్రామాలు పేరుతో ప్రజలను విడదీసి, మండలాన్ని ఆదోనికి మార్చడం రాజ్యాంగ ఉల్లంఘన కాదా, ఇవన్నీ చూస్తూ పెద్ద హరివాణం ప్రజలు ఇంకా మౌనంగా ఉండాలా అని ప్రభుత్వ అధికారులను నిలదీశారు. పెద్దహరివాణం మండలాన్ని ప్రతిపాదించిన విధానాన్ని అక్రమంగా మార్చి, అదోని-1, అదోని-2 మండలాలుగా ఏర్పాటు చేయడం కొత్త అభ్యంతరాలు కోరకుండా చేసిన ఈ చర్యను రద్దు చేసి, కొత్త ముసాయిదా నోటిఫికేషన్ జారీ చేయాలని ప్రభుత్వం నవంబర్ 27న జారీ చేసిన ముసాయిదా జిఒ నెంబర్.1503 ప్రకారం అదోని మండలాన్ని విభజించేందుకు ప్రతిపాదించిందన్నారు. ఆ ముసాయిదా ప్రకారం అదోని పట్టణాన్ని ప్రధాన కార్యాలయంగా కలిగిన అదోని మండలం పెద్దహరివాణాన్ని ప్రధాన కార్యాలయంగా కలిగిన కొత్త మండలంపై రెండు మండలాల నిర్మాణంపైనే ప్రజల నుండి అభ్యంతరాలు ఉన్నాయన్నారు. అయితే ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో,పై ప్రతిపాదనను పూర్తిగా మార్చి, పూర్తిగా కొత్త నిర్మాణాన్ని తీసుకువచ్చారు. ఆ కొత్త నిర్మాణం ప్రకారం అదోని1 మండలం, అదోని-2 మండలం రెండింటికీ ప్రధాన కార్యాలయం అదోని పట్టణమే ఈ మార్పు కొత్త ముసాయిదా నోటిఫికేషన్ జారీ చేయకుండానే, ప్రజల నుండి కొత్త అభ్యంతరాలు కోరకుండానే చేశారు. సాధారణ మార్పు కాదు అసలు ప్రతిపాదనను పూర్తిగా భర్తీ చేసిన తీవ్రమైన మార్పు ఈ చర్య కింది అంశాలను ఉల్లంఘిస్తోందని విమర్శించారు.


తహశీల్దార్‌కు సమస్యతీవ్రతను వివరిస్తున్న నాయకులు

రోడ్డుపైనే వంటావార్పు తో నిరసన

సహజ న్యాయ సూత్రాలు : భారత రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14,243 ఎపి మండల పునర్వ్యవస్థీకరణ నిబంధనలు తుది నోటిఫికేషన్ ముసాయిదాతో భిన్నంగా ఉన్నప్పుడు తప్పనిసరిగా కొత్త అభ్యంతరాలు కోరాలని చెప్పే హైకోర్టు తీర్పులిచ్చాయి. పెద్దహరివాణం , పరిసర గ్రామాల గ్రామీణ ప్రజలకు, తమ మండల ప్రధాన కార్యాలయం విషయంలో అభ్యంతరాలు వ్యక్తం చేసే చట్టబద్ధమైన అవకాశం పూర్తిగా కోల్పోయారు. ప్రస్తుతం ప్రతిపాదించిన అదోని-1, అదోని-2 మండలాల నిర్మాణం విధానపరంగా అక్రమం, ఏకపక్షంగా రద్దు చేయదగినది. అందువల్ల, వినయపూర్వకంగా ఈ కింది విషయాలను ప్రజలు కోరుతున్నారు. అదోని-1,అదోని-2 మండలాలుగా మార్చిన ప్రతిపాదనను రద్దు చేయాలని, కొత్త ముసాయిదా మండల నోటిఫికేషన్ జారీ చేయాలని, ప్రజల నుండి తాజా అభ్యంతరాలు ఆహ్వానించాలన్నారు. చట్టబద్ధంగా మండల నిర్మాణాలను ప్రతిపాదించి, గ్రామీణ ప్రజలకు న్యాయం చేకూర్చాలని, లేకపోతే, ప్రభావిత గ్రామస్తులతో హైకోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. నిరవధిక దీక్షలకు రాష్ట్ర కురుబ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, సంతేకుడ్లూరు ప్రతాప్‌రెడ్డి, ఎడవల్లి, గజ్జహల్లి, ఇంగదహల్ రైతులు సంఘీభావం తెలిపారు. దీక్షను విరమించాలని తహశీల్దార్ శేషఫణి, సబ్‌కలెక్టర్ అజయ్‌కుమార్, డిఎస్‌పి హేమలత, సిఐలు గౌస్, చంద్రశేఖర్, రామలింగయ్య, రాజశేఖర్, ఎస్ఐలు మహేష్ కుమార్, విద్యాశ్రీ, సిబ్బంది 25 మందికి పైగా చేరుకొని దీక్షలు విరమించాలని కోరగా గ్రామస్తులు ససేమిరా అన్నారు. న్యాయం జరిగే వరకు ఆందోళన ఆపేది లేదన్నారు.

ఆదోని కౌన్సిల్ సమావేశం రసాభాస

సభా మర్యాద పాటించాలి -కౌన్సిల్ ను గాడిలో పెట్టిన ఎమ్మెల్సీ బిటి నాయకుడు

ప్రజాశక్తి-ఆదోని : ఆదోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాసగా సాగింది. ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సమావేశం ప్రారంభం రావలసి ఉండగా 12 గంటలైనా మొదలు కాకపోవడంతో కౌన్సిలర్లు లలితమ్మ, పార్వతి అసహనం వ్యక్తం చేశారు. మున్సిపల్ బడ్జెట్ సమావేశం మున్సిపల్ చైర్పర్సన్ లోకేశ్వరి అధ్యక్షతన 12 గంటలు 30 నిమిషాలకు మొదలైంది. ఈ సమావేశానికి గౌరవ సభ్యుడు ఎమ్మెల్సీ బిటి నాయుడు హాజరయ్యారు. పట్టణ అభివృద్ధికి వినియోగించుకోవాల్సిన నిధులను బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ కోసం కోట్లాది రూపాయలు వినియోగించడం సమంజసం కాదంటూ కౌన్సిలర్ బాలాజీ వాపోయారు. ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ బిటి నాయుడును కోరారు. అజెండా చదవగానే మున్సిపల్ కార్మికులను నియామకం విషయంపై వాదోపవాదాలు జరిగాయి. మూడు నెలలుగా వేతనాలు లేకుండా 50 మంది కార్మికులతో అనధికారకంగా ఎలా పనులు చేయిస్తున్నారని వైస్ చైర్మన్ నరసింహులు కమిషనర్ కృష్ణను నిలదీశారు. జీతాలు అందక కార్మికులు పస్తులతో ఉన్నారని, ఏకపక్ష ధోరణి మంచిది కాదంటూ వైస్ చైర్మన్ మండిపడ్డారు. బడ్జెట్ ఆమోదం కోసం సమావేశం నిర్వహించాలని లేదా వాయిదా వేస్తారా అన్నది తేల్చాలని కమిషనర్ కృష్ణ చైర్మన్ లోకేశ్వరి దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంలోనే మున్సిపల్ కమిషనర్ వర్సెస్ వైస్ చైర్మన్ నరసింహులు అన్న రీతిలో వాదోపవాదాలు జరిగాయి. ఈ నేపథ్యంలోనే కౌన్సిల్లో గందరగోళ పరిస్థితి నెలకొంది. పట్టణ అభివృద్ధికి దిక్సూచిగా చూపించబడే మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో మున్సిపల్ చట్టాలను కొంతమంది కౌన్సిల్ సభ్యులకు గుర్తు చేస్తూ సభను ఎమ్మెల్సీ బిటి నాయుడు కలుగజేసుకుని గాడిలో పెట్టారు. ప్రతి సభ్యుడు సభామర్యాదలు పాటించాలని కోరారు. బుధవారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో బడ్జెట్ సమావేశంతో పాటు సాధారణ సమావేశం, టేబుల్ అజెండాలపై సమావేశాన్ని ఏర్పాటు చేశారు. బసాపురం ఎస్ఎస్ ట్యాంక్ మరమ్మతుల కోసం జనరల్‌ఫండ్స్ నుండి డబ్బులు చెల్లించడంతో పట్టణంలో అభివృద్ధి పనులు జరగడం లేదన్నారు. రూ.60 లక్షలు పెట్టి కొన్న వాకిటాకీలు ఏమయ్యాయో కౌన్సిల్లో ఎన్నిసార్లు ప్రస్తావించినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. బసాపురం ఎస్ఎస్ ట్యాంక్ కాకుండా చిన్న హరివాణం వద్ద కొత్త ఎస్ఎస్ ట్యాంక్ నిర్మాణం చేపడితే విద్యుత్ మోటర్లు లేకుండానే నీటిని పంపిణీ చేసుకోవచ్చని ఎమ్మెల్సీ బిటి నాయుడు వీటిపై ప్రత్యేక చొరవ చూపాలని కౌన్సిలర్ బాలాజీ కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్సీ బిటి నాయుడు మాట్లాడుతూ బసాపురం ఎస్ ఎస్ ట్యాంక్ లేదా మరో నూతన ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణానికి సంబంధించిన డిపిఆర్‌లు తయారుచేసి అందజేస్తే ఫైనాన్స్ మంత్రి, పురపాలక శాఖ మంత్రి, సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి మార్చిలో జరగబోయే రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో కచ్చితంగా నిధులు మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. శానిటేషన్ వర్కర్ల విషయమై వైస్ చైర్మన్ నరసింహులు మున్సిపల్ కమిషనర్ మధ్య వాగ్వాదం జరిగింది. మున్సిపల్ చట్టాల ప్రకారం బడ్జెట్ సమావేశం అనంతరం సాధారణ సమావేశం నిర్వహించాలని పట్టణాభివృద్ధికి సంబంధించిన బడ్జెట్ సమావేశం కావడంతో దృష్టిలో పెట్టుకొని సభ్యులందరూ అంశాలన్నింటిని చర్చించిన తర్వాత సాధారణ సమావేశం నిర్వహించుకుందామని చెప్పడంతో గందరగోళంగా ఉన్న కౌన్సిల్ సమావేశాన్ని ఎమ్మెల్సీ బిటి నాయుడు సభను గాడిలో పెట్టారు. పట్టణ అభివృద్ధికి ఎంతో కీలకమైన బడ్జెట్ సమావేశంలో అన్ని అంశాల గురించి ఎంత సమయం పట్టినా చర్చిద్దామని ఎమ్మెల్సీ బీటీ నాయుడు చైర్ పర్సన్, అధికారులను కోరారు. అంతకుముందు బడ్జెట్ సమావేశాన్ని వాయిదా వేసిన చైర్ పర్సన్ లోకేశ్వరి తిరిగి సాధారణ సమావేశం జరపాలని సభ్యులు కోరగా కొంతసేపు చర్చల అనంతరం సభను వాయిదా వేశారు. అసిస్టెంట్ కమిషనర్ నాసిర్ హుస్సేన్, మున్సిపల్ ఇంజనీర్ సత్యనారాయణ, ఎంహెచ్ఓ సందీప్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శిరీష, టౌన్ ప్లానింగ్‌ఆఫీసర్ బాలమద్దయ్య, డిఇలు రామమూర్తి, గోపీనాథ్ రాజశేఖరరెడ్డి, వైస్ చైర్మన్ మహమ్మద్ గౌస్, కౌన్సిలర్లు చలపతి, ఇంతియాజ్ ,ఉస్మాన్ వసీం, అశోక్, లక్ష్మీదేవి, పద్మావతి, ఇందు, శాంతా తదితరులు ఉన్నారు.

ప్రశ్నలడుగుతున్న మహిళా సభ్యులు

పాండవుగల్ పెద్ద చెరువు సమస్య పరిష్కరించాలి

-తహశీల్దార్‌కు వినతి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని రూరల్ మండలం పరిధిలో పాండవగల్ గ్రామంలో సర్వేనెంబర్ 135లో ఉన్న 20 ఎకరాల పాండవగల్లు పెద్ద చెరువు సమస్య హైకోర్టులో పెండింగులో ఉందని ఈ సమస్యను రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకొని తక్షణమే పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి కె.లింగన్న కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెద్ద చెరువు సమస్య డివిజన్ కోర్టు, జిల్లా కోర్టులలో ప్రభుత్వ చెరువుగా తీర్పు వచ్చినప్పటికీ, భూమిని ఆక్రమించుకున్న వ్యక్తి హైకోర్టుకు వెళ్లడంతో ఈ సమస్య హైకోర్టులో పెండింగులోఉందన్నారు. 12 సంవత్సరాలుగా పెండింగులో ఉన్న ఈ సమస్యను రెవెన్యూ అధికారులు తక్షణమే జోక్యం చేసుకొని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గతంలో ఎన్నోసార్లు అధికారులు , ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా అధికార యంత్రాంగం, ప్రభుత్వం స్పందించ లేదని అన్నారు. గత ఎన్నికలకు ముందు ప్రస్తుత ఎమ్మెల్యే గ్రామానికి వచ్చిన సందర్భంగా వారంలోగా పరిష్కరిస్తానని ఇది చాలా చిన్న సమస్య అన్నారని, గెలిచిన వారం రోజుల్లోనే సమస్యను పరిష్కరిస్తానని చెప్పిన ఎమ్మెల్యే రెండేళ్లు కావస్తున్న సమస్యపై కనీసం ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకొని పాండవగల్ పెద్ద చెరువు సమస్య హైకోర్టులో ముందుకు వెళ్లి పరిష్కారం అయ్యే విధంగా చూడాలని కోరారు. తాహశీల్దార్ శేషఫణికి వినతిపత్రం అందజేశారు. సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు జె. రామాంజనేయులు, మండల నాయకులు పాండురంగ, శాఖ కార్యదర్శి అనీఫ్‌బాషా, పార్టీ సభ్యులు హనుమంత రెడ్డి, భీమాంజనేయులు, నర్సిరెడ్డి, సానుభూతిపరులు ఉసేని, ఈరన్న, ఉసేని, గ్రామస్తులు పాల్గొన్నారు.

తొలి రోజున 89 శాతం పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-చిప్పగిరి

చిప్పగిరి మండలంలోని 13 పంచాయతీలకు గాను 16 గ్రామాలలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను 89శాతం పూర్తి చేసామని జిఎస్ డబ్ల్యూ ఎస్ అధికారి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బుధవారం మండల కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒకరోజు ముందునే లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు అందజేశామన్నారు. పింఛన్లను ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది సకాలంలో లబ్ధిదారుల ఇంటి దగ్గరకు వెళ్లి పింఛన్లను అందించారన్నారు. మిగిలిపోయిన పింఛన్లను రెండో తేదీన లబ్ధిదారులకు అందజేస్తామన్నారు.

పాలకులపై దిక్కార స్వరమే 'దుఃఖ సంచారి'

ప్రముఖకవి వెంకటకృష్ణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పాలకులపై దిక్కారస్వరంగా కెంగార మోహన్ రాసిన దుఃఖ సంచారి కవిత్వం నిలుస్తుందని, రైతుకు బాసటగా నిలిచే కవిత వాక్యాలు ఈ కవిత్వం నిండా పరచుకున్నాయని ప్రముఖ కవి వెంకటకృష్ణ అన్నారు. బుధవారం రాత్రి కర్నూలు కలెక్టరేట్ ముందున్న గాంధీ విగ్రహం ముందు కెంగారమోహన్ రాసిన దుఃఖ సంచారి కవిత్వాన్ని పర్ల గ్రామానికి చెందిన రైతు అశోక్ రెడ్డి ఆవిష్కరించారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న రైతు వ్యవసాయ కార్మిక ఉద్యమాలకు సంఘీభావంగా సాహితీ స్రవంతి జిల్లా కమిటీ ఈ ఆవిష్కరణ సభ ఏర్పాటు చేశారు. నిర్వీర్యం చేసే విధానాల వల్ల రైతు తన అస్తిత్వాన్ని కోల్పోతున్నాడని, ప్రతిఒక్కరు రైతుకు బాసటగా నిలవాలన్నారు. ఈ దేశానికి వెన్నెముక అని చాటాల్సిన అవసరం ఉందన్నారు. నల్ల చట్టాలతో రైతు బతికును చిన్నాభిన్నం చేసే ప్రయత్నాలను ప్రతి ఒక్కరు అడ్డుకోవాలని అన్నారు. దేశం కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లకూడదని, ఈ దేశానికి ఆదర్శ రైతులు అదాని అంబానీలు కాదని ఈ కవిత్వం చెబుతుందని అన్నారు. ఈ దుఃఖ సంచారి కవిత్వాన్ని వినూత్నంగా రోడ్డుపై నిర్వహించడంతో భారీ ఎత్తున జనం హాజరయ్యారు. ఈ ఆవిష్కరణ సభలో సాహితీ స్రవంతి రాష్ట్ర నాయకులు జంధ్యాల రఘు బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల చక్రపాణి యాదవ్, నాయకులు ఎంపీ బసవరాజు, గౌరెడ్డి హరిచంద్రరెడ్డి, అవిజ వెంకటేశ్వరరెడ్డి విజయులుతనగల, విరసం నాయకులు పాణి, నాగేశ్వరాచారి, రాయలసీమ ప్రచురణలు గౌరవ సంపాదకులు మారుతి పౌరోహితం, కవులుయస్ డివిఅజీజ్, సయ్యద్ జహీర్ అహ్మద్, యుటిఎఫ్ జిల్లా నాయకులు దొంతుల రాములు, సిపిఎస్ కన్వీనర్ షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రముఖకవి వెంకటకృష్ణ

యనగండ్ల గ్రామ సేవకుడు ఆకస్మిక మృతి

ప్రజాశక్తి- సి బెళగల్

యనగండ్ల గ్రామానికి చెందిన గ్రామ సేవకుడు భాస్కర్ (36) అనారోగ్యంతో బుధవారం ఆకస్మికంగా మృతి చెందారు. కాలేయం,ఊపిరి తితులు దెబ్బ తినడంతో గత కొంత కాలంగా వైద్యులను ఆశ్రయిస్తున్నారు. బుధవారం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి కోలుకోలేక మృతి చెందారు. ఆయనకు భార్య శారద , ఇద్దరు కుమారులు ఒక కుమార్తె కలరు. ఆయన మృతికి మండల తహసీల్దార్ వెంకటలక్ష్మి, రెవిన్యూ అధికారులు, గ్రామ సేవకుల సంఘం పలువురు పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు.

రీసర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది , రైతులు

రీసర్వేకు ప్రజలు సహకరించాలి

- తహశీల్దార్ శ్రీనివాసులు

ప్రజాశక్తి-నందవరం

రీసర్వేకు ప్రజలు సహకరించాలని తహశీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం టిడిపి గ్రామ అధ్యక్షులు డబ్బ ఈరన్న ఆధ్వర్యంలో కనకవీడు గ్రామంలో రీసర్వేపై ప్రజలకు అవగాహన ర్యాలీ, గ్రామసభ నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ రైతులు తమ పొలంలో ఒక సెంట్ భూమి కూడా కోల్పోరాదని, రాష్ట్ర ప్రభుత్వం రీసర్వేను పకడ్బందీగా చేపట్టిందన్నారు. ఆ రైతులు తమ భూసమస్యలు పరిష్కరించుకోవటానికి ఇది మంచి అవకాశమని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి రైతు తమ పొలాన్ని రిసర్వే చేసుకోవాలని రిసర్వే పరిధిలోని రైతులుకు వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి వారికీ నిత్యం సమాచారం తెలియజేస్తామన్నారు. రీసర్వే అయిన వెంటనే డిజిటల్ సర్వే అందుబాటులో ఉన్నటుందని డబ్బా ఈరన్న చెప్పారు.రీసర్వే డిటి మహేష్, మండల సర్వేర్ అక్బర్‌బాష, వీఆర్వో, ఉదయ్ గౌడ్, సామెల్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభ పురస్కారాలు అందుకున్న గోనెగండ్ల పోలీసులు

ప్రజాశక్తి- గోనెగండ్ల

గోనెగండ్ల పోలీస్ స్టేషన్ నుంచి జిల్లా ఎస్పి చేతుల మీదుగా ఇద్దరు పోలీసులు ఉత్తమ ప్రతిభా పురస్కారాలను అందుకున్నారు. గోనెగండ్ల పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న యు. దేవరాజు మోటార్ సైకిళ్ల చోరీ కేసులో ప్రతిభ కనబరచి భారీ సంఖ్యలో ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని కేసును చేదించడంలో కీలకపాత్ర పోషించారు. కానిస్టేబుల్ ఆర్ ఖాజా పటేల్ సిసిటిఎన్ఎస్ భాగంలో ప్రతిభ చూపడంతో వారిద్దరి సేవలను గుర్తించిన ఎస్పి 2025- బెస్ట్ పర్ఫార్మెన్స్ అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మిగనూరు డిఎస్‌పి భార్గవి జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు. ప్రశంసా పత్రాలు పొందిన పోలీసులను గోనెగండ్ల సిఐ చంద్రబాబు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

క్రమ శిక్షణతో మెలగాలి : ఎస్‌పి

-చట్టాల గురించి తెలుసుకోవాలి -సాంకేతిక వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలి
-ట్రైనీ కానిస్టేబుల్స్‌కు ఎస్‌పి విక్రాంత్ పాటిల్ దిశా నిర్దేశం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ట్రైనింగ్ లో ఉన్న కానిస్టేబుల్స్ క్రమశిక్షణతో మెలగాలని కర్నూలు జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ అన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి నూతనంగా ఎంపికై, శిక్షణ నిమిత్తం కర్నూలు జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంకు (డిటిసి) విచ్చేసిన 205 మంది ఎపిఎస్‌పి ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్లకు జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ బుధవారం దిశా నిర్దేశం చేశారు. క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. జిల్లా పోలీసు శిక్షణ కేంద్రాన్ని ఎస్‌పి పరిశీలించారు. కర్నూలు అమీలియో హాస్పిటల్ ఆధ్వర్యంలో ఎపిఎస్‌పి ట్రైనీ పోలీసులకు ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ముందుజాగ్రత్తలతో టిటి ఇంజెక్షన్లు వేయించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ ట్రైనీ కానిస్టేబుల్ అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడారు. శిక్షణ సమయంలో క్రమశిక్షణతో మెలగాలన్నారు. కొత్త కొత్త నేరాలకు అనుగుణంగా పోలీసులు మరింతగా సాంకేతిక వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. సమన్వయంతో, మానవతా దృక్పథంతో పని చేసి, సమస్యలను పరిష్కరించే విధంగా ఉండాలన్నారు. చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. శాంతిభద్రతలు అదుపులో ఉంటేనే ఆ రాష్ట్రం బాగుండి అభివృద్ధి చెందుతుందని సిఎం తెలిపారన్నారు. కానిస్టేబుళ్ళు క్షేత్ర స్థాయిలో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటారన్నారు. 9 నెలల పాటు శిక్షణ లో ఔట్ డోర్, ఇండోర్ శిక్షణతో పాటు టెక్నాలజీ, కమ్యూనికేషన్ స్కిల్స్, ఆయుధాల వినియోగం పట్ల శిక్షణ ఇస్తామన్నారు. మారుతున్న నేరాలకు అనుగుణంగా పోలీసు ఉన్నతాధికారులు శిక్షణలో మార్పులు చేసారన్నారు. శిక్షణలో పొందపర్చిన ప్రతీ అంశం కూడా వృత్తిపరంగా నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దేందుకే అని గ్రహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి అడ్మిన్ / డి టి సి ప్రిన్సిపాల్ హుస్సేన్ పీరా, కర్నూలు డిఎస్‌పి బాబు ప్రసాద్, కర్నూలు డిటిసి డిఎస్పీ / వైస్ ప్రిన్సిపల్ దుర్గ ప్రసాద్, పోలీస్ వెల్ఫేర్ హాస్పిటల్ డాక్టర్ స్రవంతి, సిఐలు , ఆర్ఐలు , ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు ఇతర సిబ్బంది, అమీలియా హాస్పిటల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రీ సర్వే

ప్రజాశక్తి-హాలహర్వి

ఎంతో కాలంగా గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం భూముల రీ సర్వే కార్యక్రమం చేపట్టిందని తహశీల్దార్ లక్ష్మీ నారాయణ, డిటి బ్రహ్మయ్య మండల సర్వేయర్ భార్గవి తెలిపారు. మండలంలోని సిరిగాపురం గ్రామంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టు పై అవగాహన గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామ సభలో తహశీల్దార్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని సర్వే సమయంలో అధికారులకు సహకరించాలని కోరారు. ఆధునిక సాంకేతిక డిజిపిఎస్(డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషన్ సర్వే) పరికరాలతో భూములు సర్వే చేపట్టనున్నట్టు తెలిపారు. సెంటు భూమి కూడా తేడా లేకుండా సర్వే చేసి ప్రతి సరిహద్దు వద్ద రాళ్లు తామే పాతుతామని చెప్పారు. ఈ సందర్భంగా రైతుల అనుమానాలను రెవెన్యూ అధికారులు నివృత్తి చేశారు. రీ సర్వేలో ఉత్పన్నమయ్యే ప్రతి సమస్యను పరిష్కరించేందుకు తహసీల్దార్ అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిటి బ్రహ్మయ్య మండల సర్వేయర్ భార్గవి విఆర్ఒలు హనుమంతు గ్రామ రైతులు పాల్గొన్నారు

అనారోగ్యంతో వ్యక్తి మృతి

-టిడిపి నాయకులు నారాయణరెడ్డి నివాళులు
- కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-నందవరం

నందవరం మండలం హాలహర్వి గ్రామంలో టిడిపి నాయకులు జి.దుబ్బన్న మామ ఇస్సాకు అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి మండల నాయకులు రైస్ మిల్ నారాయణరెడ్డి ఇస్సాకు భౌతికయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. గ్రామ టిడిపి అధ్యక్షులు ఎర్రన్న, టిడిపి మండల కార్యదర్శి ఎం. ప్రభుదాసు, నాయకులు చిన్నదావీదు, సురేష్, ఆటో ఆనంద్, ప్రభాకర్, జయన్న, సంసోన్, బోయ బుడ్డ రంగన్న, కళ్ళు గోవిందు, దుబ్బన్న, భూషణం పాల్గొన్నారు.

సిఐ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత నియమాలపై ప్రదర్శన

రోడ్డు భద్రత నియమాలు పాటించండి

సిఐ అశోక్ కుమార్

ప్రజాశక్తి-కౌతాళం

వాహనదారులు క్షేమంగా గమ్యం చేరడానికి రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సిఐ అశోక్ కుమార్ కోరారు. బుధవారం ఎస్‌పి విక్రాంత్ పాటిల్, డిఎస్‌పి భార్గవి మద్రివాడ ఆదేశాల మేరకు సిఐ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ప్రతిభ హై స్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. వైఎస్ఆర్ సర్కిల్‌లో రోడ్డు భద్రతా నియమాలకు సంబంధించి ఆరు సూచనలను సి ఐ అశోక్ కుమార్ డ్రైవర్లకు, ద్విచక్ర వాహనదారులకు, ప్రజలకు వివరించారు. ' హెల్మెట్ ధరించు ప్రాణాన్ని కాపాడుకో,, సీట్ బెల్ట్ ధరించు క్షేమంగా గమ్యం చేరు. అతివేగం- అదే చివరి ప్రయాణం,, పరిమితికి మించి ప్రయాణికులు గల వాహనాలు ఎక్కరాదు... అధిక లోడు రవాణా వద్దు- క్షేమంగా గమ్యం చేరడమే ముద్దు అని తెలియజేస్తూ డ్రంక్ అండ్ డ్రైవ్ వాహనాలు నడిపితే రూ.10 వేల జరిమాన విధించబడును. జరిమాన కట్టని పక్షంలో 3 నెలలు జైలు శిక్ష తప్పదు...' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ హైస్కూల్ సెక్రటరీ సయ్యద్ మైనుద్దీన్, పర్యవేక్షకులు భీమేష్, వ్యాయామ ఉపాధ్యాయుడు శివశంకర్,, పోలీస్ హెడ్‌కానిస్టేబుల్ సోములనాయక్, కానిస్టేబుల్ మద్దిలేటి , విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్టాండ్‌లో లైట్లు ఏర్పాటు

- 'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - కోసిగి : సమస్యలో ఆర్‌టిసి బస్టాండ్ అని ఈ నెల 29న ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఆర్‌టిసి అధికారులు బస్టాండ్ ఆవరణలో బుధవారం పారిశుధ్య పనులు చేయించి, బస్టాండ్‌లో అనుమానితులను పోలీసు అధికారులు హెచ్చరించారు. ప్రైవేట్ వాహనాలు ఆర్‌టిసి బస్టాండ్‌లోపలికి రాకుండా జరిమానాలు విధించినట్లు తెలిపారు. అలాగే బస్టాండ్ పై భాగంలో ఉన్న ఫోక్స్ లైట్లను ఏర్పాటు చేశారు. త్వరలో బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. బస్టాండ్‌లో నెలకొన్న సమస్యను ప్రజాశక్తి దినపత్రికలో చూసి స్పందించిన ఆర్టీసీ అధికారులకు 'ప్రజాశక్తి' గ్రామస్తులు, ప్రయాణికులు అభినందించారు.

IN THE COURT OF THE PRINCIPAL DIST AND SESSIONS JUDGE KURNOOL
I.A 1687/2023 in Appeal Suit NO. /2025
Shaik Shameer. ...PETITIONER
VS
B. Kasamma (Died rep by her legal heir second plaintiff) & 3 others. ...RESPONDANTS
NOTICE OF RESPONDENT NO 2.
Whereas the Petitioner filed the above IA to condone the delay of 5 days in filing the Appeal, against the orders in OS 155/2011 dt 17.10.2023 on the file of Pri Senior Civil Judge, Kurnool.You are all are hereby directed to appear before the court on date 09.01.2026 at 10.30 A.M. and to file your objection if any, otherwise you will be deemed to be set ex party.Respondent No 2:-Chadalavada Bala Subbamma wife Chadalavada Laxmi Reddy rep by G.P. Agent Sri. Illjuri Vijaya Kurmar son of Chinna Reddy H. NO. 45/142-26-C-2. V. R. Colony, Kunool Town, A.P.
By the order of the Honb'le court
Advocate for Petitioner
D.A ANEES AHAMED,
KURNOOL
Cell-9440290229.

మహిళల ఆరోగ్యం కోసం 'సఖి సురక్ష'

- మంత్రి ఎన్ఎండి ఫరూక్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మహిళల ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'సఖి సురక్ష' పథకం కవచం లాంటిందని మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. బుధవారం నంద్యాల పట్టణంలోని ఎన్టీఆర్ షాదీ ఖానా వేదికగా 'సఖి సురక్ష' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'ఆరోగ్య ఆంధ్రప్రదేశ్' లక్ష్యంలో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో మహిళల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. 35 ఏళ్ల పైబడిన స్వయం సహాయక సంఘాల మహిళలందరికీ ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వారికి అండగా నిలవడమే దీని ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్, కొలెస్ట్రాల్, గుండె జబ్బులను ముందుగా గుర్తించడం, రక్తహీనత, విటమిన్, ప్రోటీన్ లోపాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. రొమ్ము, గర్భాశయ, నోటి క్యాన్సర్ ముందస్తు నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో నంద్యాల మున్సిపల్ కమిషనర్ శేషన్న, మెప్మా పిడి వెంకట దాసు, సీఎంఎం విజయభాస్కర్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, మెప్మా అధికారులు, నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి ఫరూక్

మన నిర్లక్ష్యం ఇతరులకు శాపం కాకూడదు

-మద్యం సేవించి వాహనాలు నడపడం నేరం -సిఐ రామాంజులు

ప్రజాశక్తి-మంత్రాలయం

మన నిర్లక్ష్యం ఇతరులకు శాపం కాకూడదని సిఐ రామాంజులు, ఎస్ఐ మల్లికార్జున లు సూచించారు. బుధవారం రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రాఘవేంద్ర జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థిని విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 31న 2025 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ, 2026 నూతన సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూనే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత, నియమ నిబంధనలు పాటించాలన్నారు. లేని పక్షంలో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం నేరమని, ఒకే బైక్ పై ఇద్దరు వ్యక్తులు మించి వెళ్లడం, సైలెన్సర్ మోగించడం వంటి విరుద్ధ పనులు చేయరాదని పేర్కొన్నారు. మద్యం ప్రియులు మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయి కుటుంబాలు వీధుల్లో పడుతున్నాయని, పైగా ఎదురుగా వస్తున్న వాహన దారులు రోడ్డు నిభందనలు పాటించి సక్రమంగా వస్తున్నప్పటికి ఎదుటి వ్యక్తి నిర్లక్ష్య డ్రైవింగ్ వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేధన వ్యక్తం చేశారు. ముఖ్యంగా యువత అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు. కళాశాల కరస్పాండెంట్ సుబ్బరాయుడు, సిబ్బంది, పాఠశాల పిడి రవీంద్ర ఇతర పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయంలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఎపి మోడల్ స్కూల్‌కు రోడ్డు నిర్మాణం చేపట్టాలి

జిల్లా కలెక్టర్‌కు ఎఐఎస్ఎఫ్ వినతి

ప్రజాశక్తి - కోడుమూరు

కోడుమూరు మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల ప్రహరికి అక్రమంగా వేసిన ప్రయివేట్ దుకాణాలను తొలగించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతూ.. ఎఐఎస్ఎఫ్ నాయకులు కలెక్టర్ డాక్టర్ ఎ. సిరికి వినతి పత్రం అందజేశారు. బుధవారం కోడుమూరు పర్యటనకు వచ్చిన జిల్లా కలెక్టర్‌కు ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.రంగస్వామి సమస్యలను వివరించారు. కోడుమూరు పట్టణంలో ఉన్న జివిఆర్ జడ్పీహెచ్ఎస్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలలో విద్యార్థిని, విద్యార్థులు దాదాపుగా 1700 మంది విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాలల ప్రహరికి ఆనుకొని అక్రమంగా ప్రైవేట్ దుకాణాలు పెట్టుకొని మత్తుపదార్థాలు సీక్రెట్ పాను, గుట్కాలు వ్యాపారం చేస్తున్నారని తెలిపారు. దుకాణాలతో విద్యార్థులు చెడువాలవాట్లకు గురై స్కూలుకు రాకుండా బయట తిరుగుతున్నారని తెలిపారు. అదేవిధంగా పాఠశాలల ప్రహరికి ముందు ట్రాఫిక్ ఎక్కువగా ఉండడంతో విద్యార్థులు స్కూలుకు రావడానికి గాని మరలా తిరిగి ఇంటికి వెళ్ళడానికి దుకాణాల వలన తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే పాఠశాలల ప్రహరికి ఆనుకొని అక్రమంగా వేసిన దుకాణాలను తొలగించాలని, పాఠశాలకు రోడ్డు వేయాలన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ స్పందిస్తూ తక్షణమే పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఎఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి ఎస్. అల్తాఫ్ బాషా, నాయకులు మహేంద్ర, సాయి తదితరులు ఉన్నారు

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఐఎస్ఫ్ నాయకులు

ఆరోగ్య భద్రత కల్పించడమే ధ్యేయం

ప్రజాశక్తి-ఆదోని: రాష్ట్రంలో పేదలందరికీ ఆరోగ్య భద్రత కల్పించి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేల సీఎం చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారని టిడిపి సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడు తెలిపారు. బుధవారం టిడిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ఆదోని టిడిపి ఇంచార్జ్ మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడారు ఆరోగ్యశ్రీ వర్తించని జబ్బులకు ఆసుపత్రులలో చికిత్స పొందిన పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థిక భరోసా కల్పిస్తుందన్నారు. నియోజకవర్గంలోని 40 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.13,57,590 విలువైన చెక్కులను ఇచ్చామన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు సహకారంతో, మీనాక్షి నాయుడు కృషితో నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సాయం అందుతోందని తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారు ఈ మొత్తాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తెలుగుదేశం పార్టీ నాయకులు బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, నాయకులు, పట్టణ అధ్యక్షులు తిమ్మప్ప, జిందా శంకర్, రంగస్వామి నాయుడు, రంగన్న, వాల్మీకి వెంకటేష్ వీరేష్ ఉస్మాన్ బాలాజీ,సైదులు,ఏసు కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉమాపతి నాయుడు

బహుమతులు అందచేస్తున్న ముఖ్య అతిథులు

నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే లక్ష్యం

- చైర్మన్ ప్రొఫెసర్ జి.రామకృష్ణ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల

విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే లక్ష్యమి శ్రీరామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ ప్రొఫెసర్ జి.రామకృష్ణ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాతీయ విద్యార్థి ఉత్సవం 'స్ప్రింగ్ ఫెస్ట్ 2కె25' వేడుకలు బుధవారం ముగిశాయి. ఈ వేడుకలో వివిధ ప్రాంతాల కళాశాలల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ జి.హేమంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ కె.బి.వి. సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యూ ఇయర్ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి : సిఐ

ప్రజాశక్తి - బనగానపల్లె

నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నూతన సంవత్సర వేడుకలపై సీఐ అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకలను ఇతరులకు ఇబ్బంది లేకుండా, ఇతరుల హక్కులకు భంగం కలిగించకుండా జరుపుకోవాలన్నారు. మైనర్‌లు డ్రైవింగ్ చేయడం చట్టరీత్యా నేరం అన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుండి బనగానపల్లె కొత్త రెవెన్యూ డివిజన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

బనగానపల్లి నేటి నుండి కొత్త రెవెన్యూ డివిజన్‌గా అమలులోకి వస్తుందని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కొత్త రెవెన్యూ డివిజన్‌కు డోన్ ఆర్డిఓ నరసింహులుని ఇన్‌చార్జ్ రెవెన్యూ డివిజనల్ అధికారిగా నియమించారు. కొత్త డివిజన్ కార్యకలాపాలు సమర్థవంతంగా సాగేందుకు అవసరమైన ఇన్చార్జ్ సిబ్బందిని కూడా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

నేటి నుండి ఫిబ్రవరి 28 వరకు లైఫ్ సర్టిఫికెట్లకు గడువు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల నుండి జీవన ధ్రువపత్రాలు (లైఫ్ సర్టిఫికెట్లు) నేటి నుండి ఫిబ్రవరి 28 వరకు సబ్ ట్రెజరీలు, జిల్లా ట్రెజరీ కార్యాలయంలో స్వీకరిస్తామని జిల్లా ఖజానా, గణాంకాల అధికారి ఎం.లక్ష్మీదేవి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పెన్షనర్లు తమ జీవన ధ్రువపత్రాలను ట్రెజరీ కార్యాలయాల్లోనే కాకుండా ఆన్‌లైన్ ద్వారా 'జీవన్ ప్రమాణ్' పోర్టల్‌లో ఎక్కడి నుంచైనా సమర్పించవచ్చని, అలాగే మొబైల్ ఫోన్‌లో 'జీవన్ ప్రమాణ్' యాప్ ద్వారా కూడా జీవన ధ్రువపత్రాలు సమర్పించే సదుపాయం ఉందని తెలిపారు..

దండల బదులు పెన్నులు, బుక్కులు తీసుకురావాలి

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

మంత్రి ఎన్ఎండి ఫరూక్‌కు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేసేందుకు వచ్చే నాయకులు, కార్యకర్తలు పూలదండలు, బొకేలకు బదులుగా పెన్నులు, పుస్తకాలు తీసుకువాలని మంత్రి క్యాంప్ కార్యాలయ వర్గాలు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నాయి.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

మండలంలోని కోట కందుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వరమ్మ , కన్నయ్యలు క్రీడలను ప్రోత్సహిస్తూ విద్యార్థులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక ఆనందానికి ప్రతీక అన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శకుంతలమ్మ, కిరణ్, నాగేశ్వర్ రెడ్డి, కృష్ణవేణి, నాగభూషణ్ రెడ్డి, సంజీవరాయుడు, రమణయ్య, రామకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు బుచ్చిబాబు, రవి తదితరులు వారిని ప్రశంసించారు.



క్రీడాదుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

రాష్ట్ర ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు : మంత్రి బీసీ

ప్రజాశక్తి - బనగానపల్లె

రాష్ట్ర ప్రజలందరికీ రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు బుధవారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయం నుండి పత్రికా ప్రకటన విడుదల చేశారు. గత సంవత్సరపు మధుర జ్ఞాపకాలను మదిలో గుర్తు తెచ్చుకుంటూ సరికొత్త ప్రయాణానికి సిద్ధమవుతున్న వేళ రాష్ట్ర ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నో ఆశలు, ఆశయాలతో, నూతనోత్తేజంతో సరికొత్త ప్రయాణానికి నాంది పలికే తరుణంలో ప్రతి ఒక్కరి కలలు సాకారం కావాలన్నారు. కొత్త ఏడాది మీ జీవితాల్లో నిత్య నూతన వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. నూతన సంవత్సరం రోజున తాను అందుబాటులో ఉండడం లేదని, నియోజకవర్గ ప్రజలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు తమ కార్యాలయం వద్దకు రావద్దని తెలిపారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలన్నారు.

తూముల నిర్వహణ గాలికి..

- వన్ఆర్ తూములో పేరుకుపోయిన గుర్రపు డెక్క
- చివరి ఆయకట్టుకు అందని నీళ్లు - బీడు భూములుగా మారిన పొలాలు

తూములో పేరుకుపోయిన గుర్రపు డెక్క

చివరి ఆయకట్టు వరకు నీరు ప్రవహించని కాలువ

ప్రజాశక్తి - వెలుగోడు

వెలుగోడు తెలుగు గంగ ప్రాజెక్టు తూముల నిర్వహణను పాలకులు గాలికి వదిలేశారు. వన్ఆర్ తూములో గుర్రపు డెక్క పేరుకుపోయింది. చివరి ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. ఫలితంగా సాగు భూములన్నీ బీడు భూములుగా మారాయి. తెలుగు గంగ ప్రాజెక్టును అప్పటి ముఖ్యమంత్రి ఎన్టి రామారావు చెన్నైకి నీళ్లు తీసుకుపోవాలన్న ఉద్దేశ్యంతో మొదలు పెట్టారు. ప్రాజెక్టు నిర్మాణాన్ని తర్వాత వచ్చిన ప్రభుత్వాలు పూర్తి చేశాయి. ప్రస్తుతం ఆ ప్రాజెక్టును పట్టించుకోకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

వెలుగోడు మండలంలో వన్ఆర్ తూము కాల్వ ద్వారా 6,500 ఎకరాల పంటలు సాగు అయ్యేవి. వన్ఎల్ తూము ద్వారా 2,700 ఎకరాల సాగు అవుతుంది. ఈ రెండు తూముల ద్వారా మొత్తం 9,200 ఎకరాలు వెలుగోడు మండలంలో సాగులోకి వచ్చాయి. అయితే ముఖ్యంగా ఈ తూముల నిర్వహణను అధికారులు గాలికి వదిలేశారు. వన్ఆర్ తూములో చెత్తా చెదారం చేరుకుపోయి కింది ఆయకట్టు వరకు నీరు ప్రవహించడం లేదు. ఖరీఫ్‌లో సాగు చేసి నష్టపోయిన రైతులు రబీలో సాగు చేసి వాటి నష్టం పుర్చుకుందామనుకుంటే చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందక వందల ఎకరాల సాగు భూములు బీళ్లుగా మారిని పరిస్థితి ఏర్పడింది.

కాల్వలో పూడిక తీయాలి

వన్ఆర్ తూము కాల్వ కింద నాలుగు ఎకరాల పొలం ఉంది. కాల్వలో నీరు అందక నా పొలం మొత్తం బీడుగా మారింది. గుంతకందాల గ్రామంలో ప్రవహిస్తున్న కాల్వలో పూడిక ఎక్కువ పేరుకు పోయింది. అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి పూడిక తీయించి తూముకు నీళ్ల వచ్చే చర్యలు తీసుకోవాలి.

- రైతు శ్రీనివాసులు గౌడ్.

గుర్రపు డెక్క తొలగించాలి

కాల్వలో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించాలి. గుర్రపు డెక్క పేరుకుపోవడంతో కిందికి నీరు ప్రవహించడం లేదు. పచ్చని పంట పొలాలు బీళ్లగా మారుతున్నాయి. ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకొని కాల్వలో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించేలా చర్యలు తీసుకోవాలి.

- రైతు ఎం.శివలింగం.

నూతన బ్రిడ్జి ఏర్పాటు చేయాలి

వన్ఆర్ తూము ఏర్పాటు చేసేటప్పుడు తూము వెంట వెలుగోడు ప్రధాన రహదారి కాల్వ దాటడానికి అప్పుడు అధికారులు పైపుల ద్వారా దాటించారు. ప్రస్తుతం ఆ పైపులు చెత్తాచెదారంతో పూర్తిగా కురుకపోయి. నీరు ఇవతలకి ప్రవహించకుండా ఆటంకం ఏర్పడుతుంది. రైతు సంఘం ఆధ్వర్యంలో సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాము. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి నూతన బ్రిడ్జిని ఏర్పాటు చేసి పంట పొలాలకు సాగునీళ్లు వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

- యాదాటి నాగేంద్రుడు, రైతు సంఘం సీనియర్ నాయకుడు.

సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం

గతంలో బ్రిడ్జి సమస్యను రైతులు మా దృష్టికి తీసుకొచ్చారు. దానిని పరిశీలించి ఆర్అండ్‌బి అధికారుల దృష్టికి తీసుకెళ్లాము. వాటికి నిధుల కొరత ఏర్పడింది. స్థానిక ప్రజా ప్రతినిధితో మాట్లాడి ప్రతిపాదనలు తయారు చేసి పైకి పంపుతాము. అలాగే గుర్రపు డెక్క సమస్యను వారం రోజుల్లో పరిష్కారం చేస్తాము.

- శంకర్ రెడ్డి, తెలుగు గంగ ప్రాజెక్టు ఇఇ

సాగునీరు అందక ఖాళీగా ఉన్న పొలం

ప్రజా సంక్షేమమే లక్ష్యం : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మాట్లాడుతున్న కలెక్టర్ జి.రాజకుమారి

2025లో నంద్యాల జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమం, పారదర్శక పరిపాలన రంగాల్లో గణనీయమైన ప్రగతిని సాధించిందని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. ప్రజలకు చేరువైన పరిపాలనతో జిల్లాలోని సమస్యలకు వేగవంతమైన పరిష్కార మార్గాలు చూపడమే లక్ష్యంగా పాలన కొనసాగించామని తెలిపారు. బుధవారం స్థానిక మీడియాతో కలెక్టర్ మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా క్షేత్రస్థాయిలో పటిష్టమైన పర్యవేక్షణ చేపట్టామన్నారు. ప్రతి నెలా 1వ తేదీనే 97 శాతం వరకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ విజయవంతంగా చేపట్టినట్లు వెల్లడించారు. వ్యవసాయ రంగంలో సాధారణ విస్తీర్ణంతో పోలిస్తే ఈ ఏడాది అదనంగా 65 వేల హెక్టార్ల సాగు విస్తీర్ణాన్ని పెంచినట్లు తెలిపారు. ఉద్యాన పంటల అభివృద్ధిలో భాగంగా సాధారణ పండ్ల తోటల విస్తీర్ణానికి అదనంగా 10 వేల ఎకరాల్లో పండ్ల తోటల సాగును విస్తరించామని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలులో జిల్లా యంత్రాంగం సమన్వయంతో పని చేసిందని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ 2026లో మరింత అభివృద్ధి సాధించే దిశగా కృషి చేస్తామని స్పష్టం చేశారు.

రీ సర్వేకు రైతులు సహకరించాలి : కలెక్టర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీ సర్వే ప్రాజెక్ట్‌కు రైతులు సహకరించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలో 53 గ్రామాలను రీ సర్వే నాల్గవ దశకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ గ్రామాలన్నింటిలో ఇప్పటికే ప్రజలకు అవగాహన కల్పించేలా ర్యాలీలు, గ్రామ సభలు నిర్వహించామన్నారు. రీ సర్వే కార్యక్రమంలో కీలకమైన దశ గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియ ఈ నెల 2వ తేదీ నుండి ఈ 53 గ్రామాలన్నిటిలో ప్రారంభం కానుందని పేర్కొన్నారు. సంబంధిత రైతులందరికీ ఇప్పటికే నోటీసులు అందజేశామన్నారు. రీ సర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

జిల్లాలో నేరాలు తగ్గుముఖం

- పోలీస్ సిబ్బంది పనితీరు మెరుగు : ఎస్పీ సునీల్ షొరాణ్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మాట్లాడుతున్న ఎస్పి సునీల్ షొరాణ్

పోలీస్ శాఖలో సిబ్బంది సమర్ధవంతమైన పనితీరు, మెరుగైన పోలీసింగ్ ద్వారా జిల్లాలో నేరాలు తగ్గు ముఖం పట్టాయని జిల్లా ఎస్పీ సునీల్ షేరాణ్ అన్నారు. 2025 సంబంధించిన నేర గణాంకాలను జిల్లా ఎస్పీ మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలు అధికంగా జరిగే ప్రాంతాలలో డ్రోన్ పెట్రోలింగ్ ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నట్లు తెలిపారు. 3598 సీసీ కెమెరాల ఏర్పాటు, మెరుగైన పర్యవేక్షణ వ్యవస్థ, డేటా ఆధారిత నేర విశ్లేషణ, విజిబుల్ పోలీసింగ్ పెంపు, కేసుల ట్రయల్ ప్రక్రియపై నిరంతర పర్యవేక్షణ, శిక్షల ఆధారిత పోలీసింగ్ విధానం అమలు చేయడం వలన జిల్లాలో నేరాలు గణనీయంగా తగ్గాయన్నారు. జిల్లాలో 2024లో 5,468 కేసులు నమోదు కాగా 2025లో 4,523 కేసులు మాత్రమే నమోదు అయ్యాయన్నారు. 2024లో 46 హత్య కేసులు కాగా 2025లో 22 నమోదు అయ్యాయన్నారు. ప్రధానంగా కుటుంబ కలహాలు, ఆస్తి, డబ్బు వివాదాలు, అక్రమ సంబంధాలు రాజకీయ కారణాల వల్ల చోటు చేసుకున్నవి తప్ప ఫ్యాక్షన్ హత్యలు లేవన్నారు. హత్య కేసులు 52 శాతానికి తగ్గాయన్నారు. కిడ్నాప్ కేసులు 2024లో 21, 2025లో 11 నమోదు అయ్యాయి. 2024, 2025లలో డకాయిట్ కేసులు నమోదు కాలేదన్నారు. దోపిడీలు 2024లో 6 కేసులు నమోదు కాగా, వాటిలో 5 కేసులు డిటెక్ట్ చేయబడ్డాయన్నారు. 1 కేసు ఫాల్స్ అన్నారు. 2025లో 8 దోపిడీ కేసులు నమోదు కాగా, వాటిలో 6 కేసులు డిటెక్ట్ చేయబడ్డాయన్నారు. సాధారణ దొంగతనాలు : 2024లో 212 కేసులు, 2025లో 162 నమోదు అయ్యాయన్నారు. 2024లో 528 రోడ్డు ప్రమాదాలు జరిగి 271 మంది మరణించారని, 2025లో 542 రోడ్డు ప్రమాదాలు జరిగి 279 మంది మరణించినట్లు చెప్పారు. 2024లో 1 వరకట్న మరణ కేసు, 2025లో 1 కేసు నమోదైందన్నారు. 2024లో 9 అత్యాచార కేసులు, 2025లో 3 నమోదయినట్లు చెప్పారు. 2024లో 32 పోక్సో కేసులు, 2025లో 22 నమోదు అయ్యాయన్నారు. 2024లో మిస్సింగ్ బాలికలు : 115 (114 మందిని గుర్తించారు) మహిళలు : 208 (203 మందిని గుర్తించారు), 2025 బాలికలు 125 (122 మందిని గుర్తించారు) మహిళలు : 238 (219 మందిని గుర్తించారు) అయినట్లు తెలిపారు. ఎస్సీ ఎస్టీ కేసులు 2024లో 136 , 2025లో 76 నమోదయ్యాయన్నారు.

గిట్టుబాటు ధరల కల్పనలో ప్రభుత్వం విఫలం

- రైతులకు ఇచ్చిన పాత హామీల సాధనకు పోరాటాలకు సిద్ధం : రైతు సంఘం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఈ ఏడాది రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఏ.రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన పాత హామీల సాధనకు కొత్త సంవత్సరంలో పోరాటాలకు రైతు సంఘం సిద్ధమని స్పష్టం చేశారు. గడచిన రెండు సంవత్సరాలలో గిట్టుబాటు ధరలు లేక, పెట్టుబడి ఖర్చులు పెరిగి రైతుల ఆత్మహత్యలతో రెండు సంవత్సరాల గడిచిపోయాయని, ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని రైతు సంఘం జిల్లాలో అనేక ఆందోళన పోరాటాలు నిర్వహించిందని, కానీ కూటమి ప్రభుత్వం ఆ హామీలను తుంగలో తొక్కిందని విమర్శించారు. 2024లో వరి ధాన్యం బస్తా రైతులు రూ.2,500లకు అమ్ముకున్నారని, ఈ సంవత్సరం రూ. 1400 నుండి రూ.1500లకు అమ్ముకోవాల్సి వచ్చిందన్నారు. ఒక బస్తాకు వేయి రూ పాయలు నష్టంకు అమ్ముకోవాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరమన్నారు. మొక్కజొన్నలు ప్రభుత్వ మద్దతు ధర రూ.2400 ప్రకటించినా ప్రైవేట్ వ్యాపారస్తులు రూ. 1300 నుంచి రూ. 1600 వరకు కొనుగోలు చేస్తున్నారన్నారు. ఒక బస్తాకు రూ.800 నష్టం వస్తుందన్నారు. పొగాకు రైతులు గత సంవత్సరం క్వింటాలు రూ.15 వేలకు కొన్న వ్యాపారస్తులు ఈ సంవత్సరం రూ.3000 నుంచి రూ.5000లోపు కొనుగోలు చేశారన్నారు. పొగాకు కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.350 కోట్లు ప్రకటిస్తే జిల్లాకు ఒక్క రూపాయి కూడా తేలేకపోయినామన్నారు. ప్రజాప్రతినిధులు మిర్చి గత సంవత్సరం రూ.25 వేలు క్వింటాలు కొన్న వ్యాపారస్తులు ఈ సంవత్సరం రూ.8 వేల నుండి రూ.10 వేలతో రైతులు అమ్ముకున్నారని, ప్రభుత్వం 12 వేల కన్నా తక్కువ కొనుగోలు చేస్తే ఆ మిగతా డబ్బులు ప్రభుత్వం చెల్లిస్తుందని చెప్పినప్పటికి ఆచరణలో ఇవ్వలేదన్నారు. ఉల్లి రైతులకు రెండు హెక్టార్లకు రూ.50 వేలు చొప్పున ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించి ఒక్క రైతుకూ ఇవ్వలేదన్నారు. ఈ సంవత్సరం కూరిసిన అతి వర్షాలు, తుఫానుల వల్ల వరి, మొక్కజొన్న, మినుము, సోయాబీను ,మిర్చి, పత్తి అన్ని రకాల పంటలు పూర్తిగా దెబ్బ తిన్నాయన్నారు. వ్యవసాయ అధికారుల ద్వారా పంట నష్టాన్ని అంచనా వేసి అక్టోబర్ నెలలోనే రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు పంపారని, నవంబర్ నెలలో కేంద్ర ప్రభుత్వానికి జరిగిన నష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం తెలియజేసినా పరిహారం రాబట్టడంలో విఫలమయ్యారన్నారు. అధికారంలోకొచ్చిన మొదటి రోజుల్లో చంద్రబాబు నాయుడు గారు ఏ సీజన్లో జరిగిన పంట నష్టం ఆ సీజన్‌లోనే ఇస్తానని చెప్పి ఖరీఫ్ పంటలో జరిగిన నష్టం రబీలో కూడా ఇవ్వడం లేదు. అందుకే పాత సంవత్సరంలో ఇచ్చిన హామీలు అమలుకు రైతు సంఘం జిల్లా కమిటీ కొత్త సంవత్సరంలో కూడా ఆందోళన చేయాల్సి రావడం తప్పని పరిస్థితి ప్రభుత్వం కల్పించిందన్నారు. 2026 జనవరి నెలలో అయినా రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ముఖ్యమంత్రికి మంత్రి బీసీ కృతజ్ఞతలు

మాట్లాడుతున్న మంత్రి

ప్రజాశక్తి - బనగానపల్లె : బనగానపల్లెకు రెవెన్యూ డివిజన్ ఇచ్చి బనగానపల్లె ప్రజల చిరకాల కోరికను నెరవేర్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయం నుండి పత్రికా ప్రకటనను విడుదల చేశారు. మంత్రి మాట్లాడుతూ బనగానపల్లె రెవిన్యూ డివిజన్ ఏర్పాటుకు గెజిట్ విడుదలైందని, రెవెన్యూ డివిజన్ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయన్నారు. ప్రజల కోరికను నెరవేర్చిన సిఎం చంద్రబాబుకు, మంత్రి నారా లోకేష్‌కు, మంత్రి వర్గసభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బనగానపల్లె కొత్త రెవిన్యూ డివిజన్ ఏర్పాటుతో నియోజకవర్గంలోని ప్రజలు రెవిన్యూ డివిజన్ పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే చేసుకోవచ్చన్నారు. అధికారులు కష్టపడి పనిచేసి బనగానపల్లె రెవిన్యూ డివిజన్‌కు మంచిపేరు తీసుకురావాలన్నారు.

బనగానపల్లె రెవెన్యూ డివిజన్ కార్యాలయం ప్రారంభం

- ఆర్‌డిఒగా నరసింహులు బాధ్యతలు

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో బనగానపల్లె రెవిన్యూ డివిజన్ కార్యాలయాన్ని ఆర్‌డిఒ నరసింహులు బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆర్డిఓగా నరసింహులు బాధ్యతలు స్వీకరించి మాట్లాడారు. పాలనా సౌలభ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం అవుకు, కొలిమిగుండ్ల, బనగానపల్లె, కోవెలకుంట్ల, సంజామల మండలాలతో నూతనంగా బనగానపల్లె రెవిన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, కలెక్టర్ జి.రాజకుమారి సహకారంతో రెవిన్యూ డివిజన్‌ను అన్ని రంగాలలో జిల్లాలోనే మొదటి స్థానంలో నిలుపుతామన్నారు. రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. రెవిన్యూ డివిజన్‌కు 13 మంది సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఎఓ గా కొలిమిగుండ్ల తహశీల్దార్ శ్రీనివాసులును, ఇద్దరు డిప్యూటీ తహశీల్దార్లను, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లను, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లను, డిఐఎస్ డివైఎస్ఓలను ప్రభుత్వం నియమించినట్లు చెప్పారు. కార్యకలాపాలు తాత్కాలికంగా తహశీల్దార్ కార్యాలయంలో ఒక గదిలో నిర్వహిస్తున్నామని, త్వరలో పాత తహశీల్దార్ కార్యాలయానికి మరమ్మతులు చేసి అందులోకి రెవిన్యూ డివిజన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి రాంభూపాల్ రెడ్డి, బనగానపల్లె, అవుకు, కోవెలకుంట్ల, సంజామల, కొలిమిగుండ్ల తహశీల్దారులు నారాయణరెడ్డి ,మల్లికార్జున రెడ్డి, పవన్ కుమార్ రెడ్డి, అనిల్, శ్రీనివాసులు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బనగానపల్లె రెవిన్యూ డివిజన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఆర్డిఓ నరసింహులు

అనాధ బాలికలకు అన్నదానం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ పట్టణానికి సమీపంలోని చింతకుంట రోడ్డులో ఉన్న బాలసదనం నందు బుధవారం మధ్యాహ్నం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థినిలకు భోజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్‌తో పాటు పట్టణ సీఐ యుగంధర్ , రూరల్ సీఐ రమణ, ఎస్ఐలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు విద్యార్థినిలకు స్వయంగా భోజనం వడ్డించి, అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. విద్యార్థినీలతో స్నేహపూర్వకంగా మాట్లాడిన డీఎస్పీ ప్రమోద్ చదువుపై దృష్టి సారించి భవిష్యత్తులో మంచి స్థాయికి చేరుకోవాలని సూచించారు. పోలీస్ శాఖ ఎప్పుడూ ప్రజల భద్రతతో పాటు సామాజిక సేవలో ముందుంటుం దన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో పోలీస్ శాఖపై నమ్మకం పెరుగుతుందని, సమాజంతో మరింత సన్నిహిత సంబంధాలు ఏర్పడతాయని అన్నారు. విద్యార్థినిలకు ముందస్తు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు వరప్రసాద్ , సురేష్, జయప్ప, చిన్న పీరయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినీలతో కలిసి భోజనం చేసిన ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్

ఫెన్సింగ్ పోటీల్లో పబ్బతి చిన్మయి శ్రేయ ప్రతిభ

పతకం సాధించిన పబ్బతి చిన్మయి శ్రేయ

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్ : 69వ జాతీయ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఫెన్సింగ్ అండర్ 17 బాలికల విభాగంలో నంద్యాల క్రీడాకారిని పబ్బతి చిన్మయి శ్రేయ మూడవ స్థానంలో నిలిచి ప్రతిభ చాటారు. ఫెన్సింగ్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ తరపున మొట్టమొదటి పతకం సాధించి సంచలనం సృష్టించింది. ఏషియన్ గేమ్స్ ఫెన్సింగ్‌లో సత్తా చాటి రాయలసీమలోనే మొట్ట మొదటిసారిగా భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించి నంద్యాల పేరును దశ దిశల వ్యాప్తి చేసింది. అంతర్జాతీయ స్థాయిలో ఫెన్సింగ్ క్రీడలో సత్తా చాటేందుకు సిద్ధమయ్యింది. ఈ సందర్భంగా పట్టణంలో పలువురు ప్రముఖులు, విద్యావేత్తలు, క్రీడాకారులు, చిన్మయి శ్రేయకు అభినందనలు తెలిపారు.

ముత్తుకూరి గౌడప్ప ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి - నంద్యాల : స్వాంత్రత్య సమరమోధుడు కర్నూలు జిల్లా దేవనకొండ మండలం తెర్నేకల్లు గ్రామంముత్తుకూరి గౌడప్పయాదవ్ ఆశయసాధనకు కృషి చేయాలని ఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు బిజినవేముల శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని పద్మావతి నగర్‌లో ఉన్న జ్యోతిరావు పూలే సర్కిల్‌లో ముత్తుకూరి గౌడప్ప వర్ధంతి సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌పి ఎస్ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు పెరుగు శివకృష్ణ యాదవ్, మాల మహానాడు కడియం సాంబశివుడు, ఎస్‌డిపిఐ జిల్లా కార్యదర్శి ఎజాస్ హుస్సేన్, కాంగ్రెస్ నాయకులు చింతల మోహన్ రావు, వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా అబ్దుల్ అజీజ్, టిడిపి నాయకులు జిల్లెల్ల శ్రీరాములుతో పాటు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఒక రోజు ముందే పింఛన్లు : మంత్రి ఎన్ఎండి ఫరూక్

పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి ఫరూక్

ప్రజాశక్తి, నంద్యాల కలెక్టరేట్

పింఛన్లు జనవరి మొదటి రోజు పంపిణీ చేయాల్సి ఉండగా ఒక రోజు ముందే లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. బుధవారం నంద్యాల టౌన్‌లోని 2, 40 వార్డ్‌లలో మున్సిపల్ కమిషనర్ బి. శేషన్నతో కలిసి మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఒటింటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మునియార్ ఖలీల్, 2వ వార్డు నాయకులు మహబూబ్ జిలానీ, జాకిర్, నబిరసూల్, కలాం, ఖాజా, కొమ్మ శ్రీహరి, కరీం, జహంగీర్ మహబాషా, ఫరూక్, క్లస్టర్ ఇంచార్జ్ కామిని మల్లికార్జున, రాష్ట్ర కార్యదర్శి జిల్లెల్ల శ్రీరాములు, మాజీ కౌన్సిలర్ మిద్దె ఉస్సేని, అక్బర్ బాషా, 4వ వార్డు కౌన్సిలర్ తబ్రేజ్, జాకిర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **చాగలమర్రి :** సమాజంలోని అభాగ్యులకు కూటమి ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం ఆసరాగా నిలుస్తుందని టిడిపి నాయకులు జెట్టి నాగరాజు పేర్కొన్నారు. బుధవారం చాగలమర్రిలోని కొత్త మిద్దెల కాలనీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సచివాలయ ఉద్యోగులు, టిడిపి నాయకులు సురేష్, సాయి, కుమార్‌లు పాల్గొన్నారు. **అవుకు :** ఒక రోజు ముందుగానే పింఛన్లను అందించి పేదల జీవితాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తోందని టిడిపి మండల నాయకులు ఐవి ఉగ్రసేనారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని సంఘపట్నం గ్రామంలో అవ్వ తాతలకు పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. మండల ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పింఛన్‌దారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **శిరివెళ్ల :** సమాజంలోని అభాగ్యులకు ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అండగా నిలుస్తున్నాయని టిడిపి సీనియర్ యువనేత సూర రామ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని కాపు రాయల్ పేట, సలాదిపేట, సాయిబాబా నగర్ తదితర కాలనీలలో ఆయన ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.



చాగలమర్రిలో..



అవుకులో..



శిరివెళ్లలో..

కేకును కట్ చేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ అభినయ్, క్లస్టర్ ఇంచార్జ్ అరుణ్ కుమార్ నాయక్

పిహెచ్‌సిలో 'థాంక్యూ మినిస్టర్' కార్యక్రమం

ప్రజాశక్తి - అవుకు : అవుకు పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో థాంక్యూ మినిస్టర్ కార్యక్రమాన్ని ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ అభినయ్, టిడిపి మండల క్లస్టర్ ఇంచార్జ్ అరుణ్ కుమార్ నాయక్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వైద్య సిబ్బందితో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం అరుణ్ కుమార్ నాయక్ మాట్లాడుతూ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తన సొంత నిధులు 25 లక్షలు వెచ్చించి ఆసుపత్రికి వివిధ రకాల పరికరాలను అందించడంతోపాటు ప్రభుత్వం నుండి కూడా 26 లక్షల రూపాయలతో మరికొన్ని ప్రజలకు ఉపయోగపడే విధంగా పరికరాలను అందించడం గొప్ప విషయమన్నారు. ఆసుపత్రికి ఇంతటి సహాయం చేసిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

మైనార్టీలపై దాడులకు నిరసనగా మౌన దీక్ష

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రపంచవ్యాప్తంగా మైనారిటీలపై జరుగుతున్న దాడులకు నిరసనగా జేఏసీ కమిటీ కన్వీనర్ బీరువాల భాష ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ నాలుగు రోడ్ల కూడలిలో మౌన దీక్ష నిర్వహించారు. భారత్, బంగ్లాదేశ్లలో మైనార్టీలపై హింసను ఖండిస్తూ, న్యాయవ్యవస్థలో సంస్కరణలు, మైనార్టీల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శాంతి సమాన హక్కుల కోసం ఐక్యంగా పోరాడుతామని ప్రజా సంఘాలు, కులసంఘాల నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా ఇన్చార్జి చంద్రశేఖర్, జిల్లా జనరల్ సెక్రెటరీ ఎర్రమల చక్రవర్తి, మండల ఉపాధ్యక్షుడు బద్రి ప్రసాద్, ఎస్.డి.పి.ఐ పార్టీ నాయకుడు ఫక్రుద్దీన్, సిరివెళ్ల జేఏసీ నాయకుడు నిజాముద్దీన్, నూర్ భాషా, ఆళ్లగడ్డ జేఏసీ నాయకుడు బైక్ మెకానిక్ నూర్ భాషా, దస్తగిరి ఆళ్లగడ్డ కన్వీనర్ మూల ప్రభాకర్ తో పాటు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

మౌన దీక్ష చేపడుతున్న నాయకులు

మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

హలో కార్మిక.. చలో విశాఖ

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్

విశాఖపట్నంలో నిర్వహించనున్న సిఐటియు అఖిల భారత మహాసభలకు కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశాన్ని మండల అధ్యక్షులు దర్శనం నాగరాజు అధ్యక్షత బుధవారం నిర్వహించారు. జిల్లా కమిటీ సభ్యులు మునిపాటి చిన్న మారెన్న, జిల్లా కౌన్సిల్ సభ్యులు మేడం మల్లికార్జున మాట్లాడారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయడంలో సిఐటియు ముందుభాగాన ఉంటుందన్నారు. విశాఖపట్టణంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు కార్మికులు, కర్షకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పింఛన్ల పంపిణీలో జిల్లాలో మొదటి స్థానం

ప్రజాశక్తి - మిడుతూరు

పింఛన్ల పంపిణీలో మిడుతూరు మండలం జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిందని ఎంపిడిఒ దశరథరామయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 5,256 పెన్షన్లకు గాను 4,995 పింఛన్లు పంపిణీ చేసి జిల్లాలో 95.03శాతంతో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. పింఛన్ల పంపిణీలో పాల్గొన్న ఉద్యోగులందరికీ ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఉద్యోగ విరమణ తప్పనిసరి

సన్మానిస్తున్న పూర్వపు స్నేహితులు

ప్రజాశక్తి - చాగలమర్రి

ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరని హెచ్ఎం జీవయ్య తెలిపారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు మహబూబ్‌బాషా పదవీ విరమణ కార్యక్రమాన్ని హెచ్ఎం జీవయ్య ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహబూబ్‌బాషా 29ఏళ్ల సర్వీస్‌లో పని చేసిన ప్రతి పాఠశాలలో ఆయన గ్రామస్తుల, తోటి ఉపాధ్యాయుల మన్ననలు పొందారన్నారు. అనంతరం ఎంఇఒలు అనురాధ, ఇస్మాయిల్, పూర్వపు సహచర విద్యార్థులు, ఎస్‌టియు, పిఆర్‌టియు ఉపాధ్యాయ సంఘాలు, స్థానిక ఉపాధ్యాయ బృందం పదవీ విరమణ చెందిన మహబూబ్‌బాషా దంపతులను ఘనంగా సన్మానించారు.

5 నుంచి గ్రామ సభలు : ఎంపిడిఒ

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ చంద్రశేఖర్

ప్రజాశక్తి - పాములపాడు

పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు జనవరి 5 నుంచి ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించాలని ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బందిని ఎంపిడిఒ చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బందితో ఆయన బుధవారం సమావేశమై మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న ఎన్ఆర్ఇజిఎస్ స్కీమును విబిజిరాంజీగా కొత్తగా చట్టం తెచ్చినందున ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గ్రామ సభలు నిర్వహించాలని సూచించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు అందరూ తప్పనిసరిగా పేరు మార్పు గురించి ప్రజల్లో చైతన్యవంతులను చేయాలని దీని పట్ల లో ఆలాంటి వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టిఎలు, ఎఫ్ఎలు పాల్గొన్నారు.

బాధితునికి ఆర్థికసాయం

బాధితునికి ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

కొలిమిగుండ్ల మండలంలోని ఉప్పలూరు గ్రామానికి చెందిన నాగేశ్వరరావు అనారోగ్యానికి గురై ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న కుమ్మరి శాలివాహన సంఘం నాయకులు బుధవారం ఆర్థికసాయం అందజేశారు. మండలంలోని ఉప్పలూరు గ్రామంలో ఆర్థిక ఇబ్బందులు, వినికిడి లోపంతో వినపడక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న నాగేశ్వరరావుకు కుమ్మరి, శాలివాహన సంఘం బనగానపల్లె నియోజకవర్గం అధ్యక్షులు కుమ్మరి సురేష్ బాబు ఆధ్వర్యంలో రూ. 6వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో కుమ్మరి శాలివాహన సంఘం నాయకులు సురేష్, నాగభూషణం, నాగరాజు, రామకృష్ణ, రామసుబ్బయ్య, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

ప్రజాశక్తి - సంజామల

మండలంలోని నాయకులకు, అధికారులకు, కార్యకర్తలకు, ప్రజలకు మండల టిడిపి నాయకుడు మంచాల మద్దిలేటి రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2026లో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంపదలతో వర్ధిల్లాలని కోరారు.

300 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

నందికొట్కూరు పట్టణంలోని నీలి షికారి పేటలో ఎక్సైజ్ పోలీసులు బుధవారం ఆకస్మిక దాడులు చేసి 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. అలాగే 10 లీటర్ల నాటుసారాను గుర్తించి ధ్వంసం చేశారు. దాడుల్లో ఎస్ఐ భాస్కర శ్రీనివాసులు, కర్నూలు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ మారుతి, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

'ఉపాధి' ప్రజల హక్కు.. భిక్ష కాదు : సిపిఎం

ప్రజాశక్తి - పాములపాడు

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు నాగేశ్వరరావు

గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పిస్తున్న మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ప్రజల హక్కులని, భిక్ష కాదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. నాగేశ్వర రావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పథకాన్ని క్రమంగా నిర్వీర్యం చేసి చివరకు రద్దు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. ఉపాధి అనేది భారత రాజ్యాంగం కల్పించిన ప్రజల హక్కు అని, అది ప్రభుత్వాలు ఇచ్చే భిక్ష కాదని హితవు పలికారు. ఎన్ఆర్ఇజిఎస్ పథకాన్ని వికసిత్ భారత్ జిరాంజిగా పేరు పెట్టి బిజెపి ప్రభుత్వం ఏకపక్షంగా పార్లమెంటులో చట్టంగా ఆమోదింప చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తే గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి తగ్గి నిరుద్యోగం పెరగడం, ఉపాధి కోసం గ్రామీణ పేదలు, కూలీలు పట్టణాలకు వలస బాట పడతారన్నారు. మన రాష్ట్రంలో ఉపాధి హామీ చట్టంలో దాదాపుగా లక్షల సంఖ్యలో జాబ్ కార్డులను ఏరివేసినట్లు తెలిపారు. పంచాయతీలుగా విభజన చేసి కేంద్రం నిర్ధారించిన పారామీటర్స్ ఆధారంగా రాష్ట్రాల వారిగా ఉపాధి పనుల కేటాయింపు ఉంటుందని, ఒకవేళ అదనంగా రాష్ట్రాలు నిధులను ఖర్చు చేస్తే దాన్ని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే భరించాలని నూతన చట్టంలో ఉందన్నారు. ఉపాధి పనుల్లో కేంద్రం 60శాతం, రాష్ట్రాలు 40శాతం నిధుల కేటాయింపు ఈ బిల్లులో ప్రధాన అంశాలుగా ఉన్నాయన్నారు. రానున్న 2026బడ్జెట్లో ఉపాధి పనికి కేటాయింపులు పెంచాలని, వ్యవసాయ కూలీలకు పని దినాలు పెంచాలని, కూలీల వేతనం పెంచి గ్రామీణ వ్యవసాయ కూలీలను పేదలను ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి డి. స్వామన్న, మండల నాయకులు టి వెంకటేశ్వరరావు, ఎస్ బాలయ్య, యేసేపు పాల్గొన్నారు.

కార్యకర్తలు అధైర్యపడొద్దు : మాజీ మంత్రి బుగ్గన

ప్రజాశక్తి - బేతంచర్ల

కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన

వైసిపి కార్యకర్తలు, నాయకులు అధైర్యపడొద్దని, పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని మాజీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. బేతంచెర్ల పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలతో ఆన బుధవారం సమావేశమై గ్రామాల్లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైసీపీ కార్యకర్తలు, నాయకులు అధైర్య పడొద్దని, పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరు, రైతుల పరిస్థితి, అభివృద్ధిపై గ్రామాల ప్రజలను అడిగి తెలుసుకున్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభిస్తుందా, దిగుబడులు ఏ విధంగా వస్తున్నాయని, ఎరువుల కొరత తదితర అంశాలపై చర్చించారు. అనంతరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపడానికి వచ్చే అభిమానులు కార్యకర్తలు నాయకులు పూల బొకేలు, పూలదండలతో కాకుండా మొక్కలు, విద్యార్థులకు ఉపయోగపడే నోట్ పుస్తకాలు, అలాగే విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే జాతీయ, అంతర్జాతీయ మేధావుల జీవిత చరిత్ర, అనుభవాలు, సాధించిన విజయాలు గల పుస్తకాలతో వచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు చేసుకోవాలని కోరారు. అంతకుముందు పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాలలోని ప్రభుత్వ ఐటిఐ, పాలిటెక్నిక్ కళాశాలలను సందర్శించారు. అధ్యాపకులు, ప్రిన్సిపల్‌తో మాట్లాడుతూ.. గ్రౌండ్ సౌకర్యంగా ఉంచాలని ఎంపిపి, నగర పంచాయతీ చైర్మన్‌కు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణ్ రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, మండల వైసీపీ సీనియర్ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రుడు, మండల కన్వీనర్ కుంచా తిరుమలేశ్వర రెడ్డి, టౌన్ కన్వీనర్ పిట్టల షేక్ జాకీర్ హుస్సేన్, ఎద్దులన్న, మనోహర్, రామనాయుడు, ఖాజా బాషా తదితరులు పాల్గొన్నారు.

బసిరెడ్డి డిగ్రీ కళాశాలలో 'ఫుడ్ ఫెస్టివల్'

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్న కళాశాల యాజమాన్యం

నందికొట్కూరు పట్టణంలోని బసిరెడ్డి మెమోరియల్ డిగ్రీ కళాశాలలో 'ఫుడ్ ఫెస్టివల్‌ను బుధవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల చైర్మన్ శ్రీధర్ రెడ్డి, కరస్పాండెంట్ వివన్ సత్యనారాయణ, డైరెక్టర్లు రమేష్ రెడ్డి, శ్రీకాంత్, రమేష్, శ్రీనివాసరెడ్డి, సరళ దేవిలు ముఖ్య అతిథులుగా విచ్చేసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను, వంట నైపుణ్యాలను వెలికితీసే ఉద్దేశంతో కళాశాల ప్రాంగణంలో విద్యార్థులు ఫుడ్ స్టాల్స్ (వంటల ప్రదర్శన) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమానికి గౌరవ అతిథులుగా శ్లోక స్కూల్ ప్రిన్సిపల్ కవిత, కరస్పాండెంట్ శ్రీదేవి ప్రతి స్టాల్‌ను సందర్శించి విద్యార్థులు తయారు చేసిన రకరకాల వంటకాలను రుచి చూశారు. విద్యార్థుల నైపుణ్యాన్ని, వంటల రుచిని వారు ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు తమదైన శైలిలో ప్రత్యేకమైన రుచులతో స్టాల్స్ ఏర్పాటుపై విద్యార్థినిలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మన్సూర్ అహ్మద్, అధ్యాపక బృందం విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే సొసైటీ లక్ష్యం

- సింగల్ విండో చైర్మన్ ఎ. షహబుద్దీన్

ప్రజాశక్తి - ఆత్మకూరు

సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ షహబుద్దీన్

రైతుల సమక్షేమమే సొసైటీ లక్ష్యమని సింగిల్ విండో చైర్మన్ ఎ. షహబుద్దీన్ అన్నారు. నాబార్డ్ సౌజన్యంతో ఎఫ్ఐఎఫ్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాసత సదస్సు ఆత్మకూర్ సొసైటీ బ్యాంకులో బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సింగల్ విండో చైర్మన్ ఎ షహబుదీన్, ఆత్మకూర్ పట్టణ అధ్యక్షులు వేణుగోపాల్, విఆర్ఎస్‌పి చైర్మన్ మల్లికార్జున రెడ్డి హాజరై మాట్లాడారు. రైతులు పాడి పరిశ్రమను అలవాటు చేసుకోవాలని, నాబార్డ్ ద్వారా సబ్సిడీ లోన్లు పొంది ఆర్థిక అభివృద్ధి చెందాలన్నారు. అదేవిధంగా రిసోర్స్ పర్సన్ కొమ్మపాలెం శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు, ప్రజలు సైబర్ నేరగాళ్ల నుండి జాగ్రత్తగా ఉండాలని, గుర్తింపు పొందిన బ్యాంకుల ద్వారా గాని, సొసైటీ బ్యాంకుల ద్వారా గాని లావాదేవీలను కొనసాగించాలన్నారు. సదస్సులో సొసైటీ సిఇఒ నాగేశ్వరరావు, సొసైటీ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కాటాం రామిరెడ్డి, యూనిట్ ఇన్‌ఛార్జి మోమిన్ షాకీర్, మాజీ మండల ప్రధాన కార్యదర్శి ముర్తుజా, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి అలీ హుస్సేన్, రైతులు మహబూబ్ బాషా, ఫక్రుద్దీన్, రైతు సంఘ నాయకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి - కొత్తపల్లి

కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ పుట్టిన రోజు వేడుకలను నంద్యాల కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు ఎంపి మద్దిలేటి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ముందుగా ఆత్మకూర్ పట్టణంలోని వృద్ధాశ్రమంలో మాజీ ఎమ్మెల్యే పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పని చేసిన సమయంలో పేద ప్రజల కోసం కష్టపడిన ఏకైక వ్యక్తి అన్నారు. అనునిత్యం నియోజకవర్గంలో తిరుగుతూ పేద ప్రజల సమస్యలను తన సమస్యగా భావించి పరిష్కరించే నాయకుడు అన్నారు. మచ్చలేని స్వఛమైన నాయకుడు పేద ప్రజల ఆశాజ్యోతి అన్నారు. కరోనా సమయంలో ప్రాణాలకు వెనకాడకుండా పేదలకు అందించిన సేవలు ఎనలేనివి అన్నారు. కరోనా సేవలకు వరల్డ్ బుక్ అవార్డు అందుకున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎర్రమఠం ఓబులేసు, జీవన్, చంద్రశేఖర్, మహేశ్వరరావు, షఫీ ఉల్లా పాల్గొన్నారు.

గ్రామాల్లో పండగ వాతావరణం

- పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

వెలుగోడు

కోవెలకుంట్ల

బనగానపల్లె రూరల్

ప్రజాశక్తి- వెలుగోడు

గ్రామాల్లో పింఛన్ల పంపిణీ పండగ వాతావరణాన్ని తలపిస్తుందని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి బుధవారం అన్నారు. జనవరి 1 నూతన సంవత్సరం కావడంతో, ప్రజా ప్రతినిధులు అధికారులు, సిబ్బంది నూతన సంవత్సర వేడుకల్లో ఉండనుండడంతో ఒక్క రోజు ముందుగానే పంఫించన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. నూతన సంవత్సరం 2026లోకి అడుగుపెడుతున్న తరుణంలో ప్రతి ఇంట పండగ వాతావరణం నెలకొనాలనే ఉద్దేశంతో ఒక్కరోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.

కోవెలకుంట్ల : సిఎం చంద్రబాబు పాలన ప్రజలకు సంతృప్తినిచ్చిందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి అన్నారు. పింఛన్లు పంపిణీ చేసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు నేతృత్వంలోని ఎన్‌డిఎ పాలనలో ఆంధ్రప్రదేశ్ ప్రజలందరికీ సంతృప్తి ఇచ్చే పాలన అందిస్తున్నారని తెలిపారు.

మిడుతూరు : మిడుతూరు మండలం నాగలూటీ గ్రామంలో ఎమ్మెల్యే గిత్త జయసూర్య లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. అలాగే వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో కలియతిరిగి స్థానికంగా ఉన్న ప్రజా సమస్యలు, మౌలిక సదుపాయాల కల్పన, ప్రభుత్వ పనితీరు వంటి అంశాలపై నేరుగా ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. సిఎం చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రజల అభివృద్ధి సంక్షేమం కాంక్షించే మంచి ప్రభుత్వం అన్నారు. కార్యక్రమంలో మిడ్తూర్ మండల కన్వీనర్ రమేష్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి, నాయకులు రవీంద్రబాబు, బాబుసాహెబ్ పాల్గొన్నారు.

బనగానపల్లె రూరల్ : కూటమి పాలనలోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని మిట్టపల్లి సర్పంచి వై. తులసి రెడ్డి అన్నారు. మండలంలోని కాపులపల్లె, మిట్టపల్లె గ్రామాల్లో ఆయన పింఛన్లు పంపిణీ చేసి మాట్లాడారు. జనవరి ఒకటో తేదీ సెలవు కావడంతో ఒకరోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. నూతన సంవత్సర వేడుకలను ప్రజలు సుఖసంతోషాలతో జరుపుకోవాలని ముందస్తుగా పింఛన్లు పంపిణీ చేశామన్నారు. మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సహకారంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లైన్మెన్ హుస్సేని ,గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మిడుతూరు

కొలిమిగుండ్ల : కొత్తగా మంజూరైన స్పౌజ్ పింఛన్లను టిడిపి ప్రచార కార్యదర్శి ఎం. శివరామిరెడ్డి ఆధ్వర్యంలో హనుమంత గుండం సహకార సంఘం అధ్యక్షులు ఎం. శివారెడ్డి బుధవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కోటపాడు గ్రామానికి చెందిన మూరబోయిన గుర్రమ్మ అనే వితంతు మహిళకు రావాల్సిన సామాజిక భద్రతా పింఛనును కూటమి ప్రభుత్వం సహకారంతో అందజేసినట్లు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను మంత్రి బిసి జనార్ధన రెడ్డి అండదండలతో అర్హులైన అందరికీ అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివన్ చౌడయ్య, మహిళా పోలీస్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల


విజేతలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

జాతీయ స్థాయి కరాటేలో లిటిల్ ఏంజల్స్ ప్రతిభ

ప్రజాశక్తి - వెలుగోడు

ఈ నెల 25, 26తేదీల్లో చండీగఢ్ రాష్ట్ర మొహలిలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటేలో వెలుగోడు పట్టణానికి చెందిన లిటిల్ ఏంజల్స్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. పోటీల్లో 9వ తరగతి విద్యార్థులు వై. నాగ జస్వంత్ రెడ్డి గోల్డ్ మెడల్, ఎస్ తేజస్ గౌడ్, ఇర్ఫాన్‌లు సిల్వర్ మెడల్‌లు, పట్టణానికి చెందిన చరణ్ కాంస్య పథకం సాధించారు. వీరిని పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎంఎఫ్ ఇమ్మానియేల్, హెచ్ఎం అప్పియ ప్రశాంత, సిఇఒ జోసెఫ్ రిచర్డ్ సన్, ఎఒ అనీల్ క్రిస్టఫర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి బుధవారం ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీలకు శిక్షణ ఇచ్చిన కోచ్ జయచంద్ర గౌడ్‌ను, పాఠశాల యాజమాన్యాన్ని ప్రశంసించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. కరాటేలో మరింత సాధన, శిక్షణ పొంది అంతర్జాతీయ స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. పథకాలు సాధించిన క్రీడాకారుల కుటుంబ సభ్యులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో నాయకులు అన్నారపు శేశి రెడ్డి, ముల్లా అబ్దుల్ కలాం, ఖలీల్ ఖాన్, అమీర్ హంజా, రఘు స్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి దినదినాభివృద్ధి చెందాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆత్మకూరు :

ప్రజాశక్తి తెలుగు దినపత్రిక ప్రజలకు మరింత చేరువ కావాలని, దినదినాభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఆయన ప్రజాశక్తి క్యాలెండర్, డైరీలను బుధవారం ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజాశక్తి ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పని చేస్తుందని, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని రావడంలో ముందు భాగాన నిలిచిందన్నారు. ప్రజా సమస్యలను ప్రముఖంగా ప్రచురించడంలో ప్రజాశక్తి నైజాం అన్నారు. కార్యక్రమంలో ప్రజాశక్తి డివిజన్ ఇన్‌ఛార్జి శివప్ప, విలేకరులు కె.జె చంద్రశేఖర్, శివశంకర్ పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న టిప్పర్లు సీజ్

ప్రజాశక్తి - శిరివెళ్ల/మహానంది

మండలంలోని నల్లమల అటవీ సమీపంలోని మహాదేవపురం గ్రామ పొలిమేర పరిధిలోని పోలేరమ్మ రస్తాను కొల్లగొడుతూ అక్రమంగా ఎర్ర మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లను మైన్స్ అండ్ జియాలజీ శాఖ అధికారులు బుధవారం సీజ్ చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ తవ్వకాలు జరిపి రహదారిని తోడేసి మట్టిని అమ్ముకున్న సంఘటన మహాదేవపురం గ్రామంలో గత పది రోజులుగా సంచలనంగా మారింది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ స్పందించి విచారణ కమిటీ వేసి నివేదిక కావాలని కోరగా మైన్స్ అండ్ జియాలజీ అధికారులు సిబ్బంది రెండు టిప్పర్లను సీజ్ చేసి మహానంది మండల పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉంచారు.

జెవివి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - నంద్యాల : జెవివి నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా గౌరవ అధ్యక్షులు డాక్టర్ కె.నాగరాజు, ప్రధాన కార్యదర్శి పి గోపాల్‌లు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మద్యపానానికి, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ, కుటుంబ సభ్యులతో కలిసి చిన్న చిన్న సాంస్కృతిక కార్యక్రమాలతో, మధురమైన మిఠాయిలతో నూతన సంవత్సరాన్ని ఆహ్వానించాలని పేర్కొన్నారు. జన విజ్ఞాన వేదిక లక్ష్యం రాజ్యాంగంలోని 51ఏ హెచ్ శాస్త్రీయ దృక్పథాన్ని విద్యార్థుల్లో, ప్రజల్లో పెంపొందించడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో గౌరవ సలహాదారు శంకరయ్య, సీనియర్ జెవివి నాయకులు రామరాజు, చిన్నయ్య, కాజా మొయిద్దీన్ రామకృష్ణుడు, నరసింహారెడ్డి ,రమణ సురేష్ లు పాల్గొన్నారు.

12 తెలంగాణ బీర్ బాటిళ్లు స్వాధీనం : ఎస్ఐ

ప్రజాశక్తి - ప్యాపిలి : నిబంధనలకు విరుద్ధంగా 12 తెలంగాణ రాష్ట్రం బీర్ బాటిళ్లను తరలిస్తున్న జి రాజ్ కుమార్(35) అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నాగార్జున తెలిపారు. పెద్ద పూజల్ల రోడ్డులోని ఎన్‌హెచ్ 44వ వంతెన వద్ద బుధవారం వాహన తనిఖీలు చేస్తుండగా పెద్ద పూజళ్ల గ్రామానికి చెందిన వెంకట్రాముడు కుమారుడు రాజ్ కుమార్ వద్ద నుండి తెలంగాణ రాష్ట్రానికి చెందిన 12 ఎన్డిపిఎల్ బీర్ బాటిళ్లతో పట్టుబడ్డాడని తెలిపారు. అతని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపనున్నట్లు తెలిపారు.

రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలి : విఆర్ఒ

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల : రీసర్వేని రైతులు సద్వినియోగం చేసుకోవాలి మండల సర్వేయర్ మల్లికార్జున, విఆర్ఒ శివ ప్రసాద్ రెడ్డి అన్నారు. కొలిమిగుండ్ల మండలంలోని నందిపాడు గ్రామంలో రీసర్వేపై బుధవారం ర్యాలీ చేపట్టి గ్రామ సభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పరిధిలోని రైతులు భూముల రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్ లోకనాథ్ రెడ్డి, సర్వేయర్ పవన్ పాల్గొన్నారు.

సామాజిక సేవలో అవోపా ముందంజ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ :

జర్నలిస్టులను సన్మానిస్తున్న దృశ్యం

అవోపా సంస్థ ఎల్లప్పుడూ సామాజిక కార్యక్రమాలలో ముందుండి తమ వంతు సేవలు అందిస్తున్నదని ఆళ్లగడ్డ అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. బుధవారం స్థానిక అవోపా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెంకటసుబ్బయ్య మాట్లాడారు. పట్టణంలో తమ సంస్థ ఆధ్వర్యంలో అంత్యక్రియల కోసం ఏర్పాటు చేసిన వైకుంఠధామం జిల్లాలోనే ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుందన్నారు. కులమతాలకు అతీతంగా వైకుంఠ రథాన్ని కూడా ఏర్పాటు చేశామన్నారు. గత నెలలో అమ్మవారి శాలలో నిర్వహించిన వెరికోస్ వైన్స్ మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందన్నారు. అనంతరం సీనియర్ జర్నలిస్టులు సూర్య శ్రీనివాసరావు, ప్రజాశక్తి నిజాముద్దీన్, విశాలాంధ్ర ఇస్మాయిల్ బేగ్ లను అవోపా సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అవోపా సంఘం స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రావు, ఆవోప కార్యదర్శి గోవిందరాజులు, ట్రెజరర్ సురేంద్ర కుమార్, సభ్యులు కృష్ణమూర్తి, జగదీష్ లు పాల్గొన్నారు.